₹ 10/-

జన రాజకీయం కోసం...


# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 9 పక్షపత్రిక సంచిక - 07

ఏప్రిల్ 1-15, 2018



సిద్ధాంతాలకన్నా ముందు...



## ఎందరో అంబేద్కర్ భక్తులు, అయినా జాతికి అలవడని ప్రజాస్వామ్య పద్ధతులు

(ఆంధ్రప్రదేశ్ 'హోదా' పోరాటాలు - రాజ్యాంగ ప్రజాస్వామ్యం)

విభజన హామీలపై 'స్వతంత్ర నిపుణుల బృందం' ఏర్పాటు



# ఎన్‌హెచ్‌ఎస్ లేకుంటే ఇంతకాలం బతికేవాడ్ని కాను

"ప్రజల జేబులో నుంచి ఖర్చు లేకుండా అందరికీ అందుబాటులో నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే జాతీయ ఆరోగ్య పథకం (ఎన్‌హెచ్‌ఎస్, బ్రిటన్) లేకుంటే నేను ఇన్నేళ్లు బతికేవాడిని కాను. ఎన్ని లోపాలున్నా ఎన్‌హెచ్‌ఎస్ మానవీయ, నాగరిక వ్యవస్థకు సంకేతం. ఎన్‌హెచ్‌ఎస్ నిధులకు కోత విధించటం, వ్యయంపై పరిమితి పెట్టటం, ప్రైవేటీకరణతో సేవలను దిగజార్చటం అన్యాయం. ఇదంతా అమెరికా తరహా 'ఇన్సూరెన్స్ ఆధారిత' ఆరోగ్య విధానానికి (అమెరికాలో బీమా ఆధారిత ఆరోగ్య విధానం వల్ల జీడీపీలో 17 శాతం దాకా నిధులు ఖర్చవుతున్నా తగిన ఆరోగ్యసేవలు ప్రజలకు అందటం లేదు) దారితీస్తుంది. ఎన్‌హెచ్‌ఎస్ నన్ను కాపాడింది. ఆ పథకాన్ని కాపాడటానికి ఒక శాస్త్రవేత్తగా నా వంతు తోడ్పాటు అందిస్తాను."

- స్టీఫెన్ హాకింగ్


(భారత్‌లో ప్రజలపై ఎటువంటి ఆర్థికభారం లేకుండా, దేశ బడ్జెట్ పరిధిలోనే 'అందరికీ ఆరోగ్యం' అందించేలా తాను రూపొందించి ప్రభుత్వాలకు అందించిన ఆరోగ్య పథకాన్ని బ్రిటన్ ఎన్‌హెచ్‌ఎస్ నమూనాలోనే లోక్‌సత్తా తయారుచేసింది).

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

ఏప్రిల్ 1-15, 2018 సంపుటి - 9 సంచిక - 07




## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

ఎందరో అంబేద్కర్ భక్తులు, అయినా.............. 5

మహాత్ముడూ చంపారన్ ఆంగ్లేయులూ........... 15

మహాత్ముడిలో విప్లవం................................ 17

వృద్ధి ఉత్సాహానికి, విధాన లోపాలకి అద్దం...... 20

తెలంగాణ బడ్జెట్ 2018 - 19................... 23

సానుకూల చిత్రాన్ని ఆవిష్కరించిన ఏపీ .......... 26

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2018-19...................... 28

హోదాపై పోరు పెద్ద మార్పులకు దారి తీయాలి. 32

నిజమైన పౌరసత్వానికి నిదర్శనం రాయ్..........33

రాజకీయ క్రీడల్లో ప్రజలు పావులు కాకూడదు... 34

### సంపాదక వర్గం

డా|| జయప్రకాష్ నారాయణ్

ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు

డా|| ఆలూరి విజయలక్ష్మి

కె.వి. కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**

**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# సిద్ధాంతాలకన్నా ముందు...

ఈశాన్య రాష్ట్రం త్రిపురలో సీపీఐ (ఎం) రెండున్నర దశాబ్దాల ఏకఛత్రాధిపత్యానికి గండికొట్టి బీజేపీ 'శూన్యం' నుంచి అధికార శిఖరాన్ని అందుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓ వ్యాఖ్య చేశారు. 'ఇది ఓ మారుమూల చిన్న రాష్ట్రంలో సాధించిన చిన్న విజయం కాదు. బీజేపీ సాధించిన చరిత్రాత్మక, సైద్ధాంతిక విజయం. దీని ప్రభావం రాజకీయంగా దేశమంతటా ఉంటుంది'! అయితే.. ఇదేమీ తమ సైద్ధాంతిక ఓటమి కాదని, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విషయంలో జరిగినట్టు త్రిపురలో కాంగ్రెస్ దాదాపు కనుమరుగవటం, నేతల్ని, వార్తల్ని సహా డబ్బుతో కొనుగోళ్లు, 42.7శాతం ఓట్లు సాధించిన సీపీఎం ఫ్రంట్‌కు ఆ మేరకు సీట్లు రాని మన ఎన్నికల వ్యవస్థ వంటి కారణాల వల్ల ఓడామని వామపక్షనేతలు వాదిస్తున్నారు. ఎవరి రాజకీయ సిద్ధాంతంలో ఎంత విషయముంది, దేని ప్రాసంగికత ఎంత అనేవి చర్చనీయాంశాలే. కానీ అంతకంటే ముందు ఈ దేశ రాజకీయానికి అత్యవసరమైనది- ఒక కనీస ఉమ్మడి ఎజెండా, ఆ అంశాల అమలు పద్ధతులపై స్థూల ఏకాభిప్రాయం!. ప్రతిపక్షంలో ఒకలా, అధికారంలోకొచ్చాక ఇంకోలా వ్యవహరించటం, ఎన్నికల్లో ఇష్టమొచ్చినట్టు ప్రలోభాలను హామీలివ్వటం, ఎన్నికయ్యాక ఆ ప్రలోభాలను అమలుచేస్తూ ప్రభుత్వాలు చేయాల్సిన అసలు పనుల్ని వదిలేయటం, ప్రజాప్రతినిధులు చట్టసభల్ని వదిలేసి రోడ్ల మీద మీటింగుల్ని పెట్టటం, ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకోవాల్సిన స్పీకర్లు అధికారపార్టీ తొత్తుల్లా వ్యవహరించటం, ఓటర్లకు డబ్బు పంచటం ఎన్నికల్లో పోటీకి కనీస అర్హతగా మారటం, శాసనవ్యవస్థకు-ప్రభుత్వానికి మధ్య గీత చెరిగిపోవటం, ఎన్నికయ్యాక అధికార పార్టీ వారు గాడి తప్పితే ప్రజాభిప్రాయంతో అదుపు చేసే అవకాశాలు సన్నగిల్లటం, రాజ్యాంగబద్ధ ఆందోళనాపద్ధతులను పట్టించుకోకపోవటం, ప్రజలకు రోజువారీ పనులపై కూడా నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోవటం, జనానికి సేవకులుగా పనులు చేసిపెట్టాల్సిన ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు పెచ్చరిల్లటం, భద్రత కొరవడి, సకాలంలో న్యాయం అందే ఏర్పాట్లు లేక మహిళలు, సామాన్యులు బిక్కుబిక్కుమంటూ బతకటం.. వంటివి పరిష్కరించకుండా ఈ దేశంలో ఎన్ని సిద్ధాంతాలు చెప్పి ఏం లాభం? ఇటీవల యూపీ, బీహార్ ఉపఎన్నికల్లో బీజేపీ ఓటమి గురించి వేడివేడి చర్చలు చేశారుగానీ.. పరిపాలనలో ఏం లోపాలు జరిగాయి, ప్రత్యామ్నాయంగా ప్రతిపక్షాలు ఏ విధమైన విధానాల్ని సూచిస్తున్నాయి? అనే స్పృహే లేకుండా పార్టీల గెలుపోటముల గురించి జాతీయ మీడియా దాకా చొక్కాలు చించుకున్నారు. ఏ పార్టీ అధికారంలోకొచ్చినా, తమ సిద్ధాంతాలకు అనుగుణంగా గొప్ప పాలన అందించాలనుకున్నా, గొప్ప భారతదేశ నిర్మాణానికైనా ముందు సరిచేయాల్సిన మౌలిక లోపాలవి. జాతీయం, ప్రాంతీయం అని తేడా కూడా లేదు. ఏ సిద్ధాంతమూ లేకుండా ప్రజలకు నచ్చే పాలననే అందిస్తామంటూ గాలిమరల్లా ఎటు గాలికొడితే అటు తిరిగే సాధారణ పార్టీలు కూడా వీటిని అమలుచేయాల్సి ఉంటుంది. అందుకే తమ సిద్ధాంతాల్ని, సూత్రాల్ని పక్కనపెట్టి అన్ని రాజకీయ పార్టీలూ ఉమ్మడి ఎజెండాపై ఒక విశాల చర్చను, పునస్సమీక్షను ఈ దేశంలో చేపట్టటం అవసరం. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పార్టీ పెట్టినా, కొన్నిచోట్ల అధికారంలోకి వచ్చినా ఇప్పటిదాకా అంబేద్కర్ ఆశించిన రాజ్యాంగబద్ధ ఆందోళనలకు విరుద్ధంగా వ్యవహరించిన వామపక్ష శక్తుల్లో కొందరు ఇటీవల మహారాష్ట్రలో రాజ్యాంగ ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిర్వహించిన రైతు ఆందోళనలో ప్రధాన పాత్ర పోషించారు. సమగ్ర ఎజెండా లేకున్నా, రైతుల డిమాండ్లకు ప్రభుత్వం ముందే సానుకూలతను వ్యక్తం చేసినా ఆందోళన చేశారనే విమర్శలున్నా.. ఈ పోరాటం పలువురి పౌరుల మన్ననల్ని పొందింది. అధికార బీజేపీవారి ప్రశంసల్ని కూడా చూరగొంది. రాజ్యాంగ ప్రజాస్వామ్యం దిశగా ఈ తరహా మౌలిక దిద్దుబాట్లు విశాలస్థాయిలో కావాలిప్పుడు. ఇందుకు అధికార పార్టీతోపాటు ఓట్లు, సీట్లు ఉన్న పార్టీలు చొరవ తీసుకోవాలి. ఇతర పార్టీలు, పౌరసమాజంలో సుదీర్ఘ కృషి నేపథ్యం వున్నవారు, వివిధ రంగాల నిష్ణాతులు భాగస్వాములు కావాలి. ఏ పార్టీ అధికారంలోకొచ్చినా.. చట్టబద్ధపాలన, అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చేందుకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం, అవినీతి అంతానికి సరైన చట్టసవరణలు, రైతులకు ఆదాయం, రాజకీయ నేతలు బ్రోకర్లలా ప్రజలకు రోజువారీ పనులు చేసిపెట్టాల్సిన అవసరం లేకుండా పౌరసేవల చట్టం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారత వంటివి విధిగా అమలు చేసే ఏర్పాట్లు చేయాలి. ఇందుకోసం రాష్ట్రాలకు మరింత స్వయంప్రతిపత్తినివ్వాలి. ఎన్నికల్లో డబ్బు ప్రభావం తగ్గించటానికి దామాషా పద్ధతి, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక వంటి మార్పులు, స్పీకర్‌గా నియమితులైనవారికి పార్టీ లేబుళ్లను తొలగించి స్వతంత్రంగా వ్యవహరించే ఏర్పాటు వంటి వాటిపై ఏకాభిప్రాయానికి రావాలి. యధాలాప ఆర్థిక సానులకూలతలతో దేశం పడుతూలేస్తూ ముందుకు నడుస్తోంది తప్ప, ప్రజలకు దిశానిర్దేశం చేసే నాయకత్వముండి కాదు. సిద్ధాంతాలకు, పక్షపాతాలకు అతీతంగా మౌలికాంశాల్లో ఒక ఉమ్మడి ఎజెండాను దేశానికి రూపొందించటానికి అన్ని పార్టీలవారూ ముందుకు రావటమే ఈ విపత్తుకు విరుగుడు. పార్టీలు, పౌరసమాజం దేశ ప్రజల ప్రయోజనాల కోసమే! సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు అనే సత్యంపై వివాదం ఉంటుందా? దేశ ప్రయోజనాలను కాపాడటానికి అన్ని పార్టీలతో కలిసి జాతీయ ప్రభుత్వాలు ఏర్పాటు చేయటం జర్మనీ వంటి చోట చాలా సాధారణం. మనం ప్రజాస్వామ్యాన్ని ఏర్పరచుకోగలిగాంకానీ, అలాంటి దేశాల్లోలా ప్రజాస్వామ్యాన్ని సరైన పునాదులతో పటిష్టపరచుకోవటంలో మాత్రం చాలా వెనుకబడి ఉన్నాం. ప్రజలు రిసీవ్ చేసుకోవటానికి సిద్ధంగా లేరా అంటే.. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) చేయండని ప్రజలేమన్నా అడిగారా? తాము ఎన్ని అవస్థలు పడుతున్నా.. ఓ మంచి మార్పు కోసం చేస్తున్నారని స్వాగతించలేదా? ప్రపంచ చరిత్రలో ఇంత పెద్దఎత్తున ప్రజల్ని ప్రభావితం చేసిన ఘటన మరోటి లేదేమో! "మన జన్యువుల్లో నుంచి దుందుడుకుతనం ఇంకా తొలగిపోలేదు. భూ గ్రహాన్ని నాశనం చేయగల సాంకేతికతను సాధించాంగానీ, మనిషికి వేరే ఆవాసాన్ని సాధించుకోలేకపోయాం. రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి ఏదో ఒక రూపంలో ప్రపంచ ప్రభుత్వ ఏర్పాటు అవసరం కూడా ఉంటుంది" అని స్టీఫెన్ హాకింగ్ అన్నారు. అనారోగ్యం, అవిటితనంపై ఆత్మశక్తితో విజయం సాధించిన గొప్ప శాస్త్రవేత్త అంటూ స్టీఫెన్ హాకింగ్‌కు ఎంతో గాఢంగా నివాళులర్పించిన మనం.. ఆయన మాటల్లోని హితాన్ని గుర్తించలేమా? కొంతైనా విజ్ఞతను ప్రదర్శించి మనదేశ ప్రజల క్షేమం కోసం ఒక ఉమ్మడి ఎజెండాను 'మిషన్ మోడ్'లో రూపొందించుకోలేమా?



❑

# ఎందరో అంబేద్కర్ భక్తులు, అయినా జాతికి అలవడని ప్రజాస్వామ్య పద్ధతులు


**(ఆంధ్రప్రదేశ్ 'హోదా' పోరాటాలు - రాజ్యాంగ ప్రజాస్వామ్యం)**

**బా**బాసాహెబ్ డా॥ బీఆర్ అంబేద్కర్ వ్యక్తిపూజకు వ్యతిరేకమైనా, ఆయన విగ్రహాలు పెరుగుతున్నాయేగానీ తగ్గడం లేదు. కొన్నాళ్లకి ఆయన బొమ్మలేని ఏరియా దేశంలోనే కనిపించకపోవచ్చు. రిజర్వేషన్లనో, రాజ్యాంగ మనో, మరోటనో.. ఇలా ఏదోకరకంగా ఏదోక మేర సానుకూలత ఉన్న కారణాల తోనే ఈవేళ దేశంలోని మెజారిటీ ప్రజలు అంబేద్కర్‌ను గౌరవిస్తున్నారు. ఆ లెక్కన.. వీరందరిలో అంబేద్కర్ తపనపడ్డ ప్రజాస్వామిక విలువలు, సంస్కృతి ఏదోకస్థాయిలో కనిపించాలి. ఆయన దార్శనికత ప్రభావం కొంతైనా దర్శనమిస్తుండాలి. వీరిలో నాలుగోవంతు మంది అంబేద్కర్ ఆలోచనల కనుగుణంగా వ్యవహరించినా.. ఈ దేశంలో ప్రజాస్వామ్యం వేగంగా పరిణతి చెందుతుండాలి. దేశంలో ఉన్న వనరులు, యువత శక్తిసామర్థ్యాల మేర జనం జీవితాల్లో మేలి మార్పులు వేగంగా చోటు చేసుకుంటుండాలి.. కానీ అవేమీ అగుపించటం లేదు. పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది.

తప్పనిసరైతేనే మనదేశంలో మార్పు వస్తోంది తప్ప, నాయకత్వం రాజ్యాంగాన్ని అర్థం చేసుకుని ముందుండి నడిపించటం వల్ల కాదు. ఏమాత్రం బలహీన పరిస్థితులు ఏర్పడినా.. చిన్న చిన్న విషయాల్లో కూడా జన జీవితాల్లో నష్టం తీవ్రస్థాయిలో సంభవిస్తోంది. స్వతంత్రం వచ్చి డెబ్బై ఏళ్లు దాటినా ఇంకా సగానికిపైగా ప్రజానీకానికి సమానావకాశాలు లేవు. కొన్ని రంగాల్లో అంతరాలు ఇంకా ఇంకా పెరుగుతున్నాయి. అంబేద్కర్ ఆలోచనలను ఆచరిస్తే.. వాటిలో చాలావరకు నివారించదగ్గవి, పరిష్కరించదగ్గవే.

అంబేద్కరేమీ విమర్శలకు అతీతుడు కాదు. కానీ ఆయన కృషిని, ఆయనలోని అనేక సానుకూలాంశా లను అంశాలను అధ్యయనం చేసే, అర్థం చేసుకునే శక్తి కూడా ఆయన్ను ఆరాధించేవారిలో కొరవడటం అసలు సమస్య.

అంబేద్కర్ చెప్పిన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని ఇప్పటికీ మనం అలవరచుకోకపోవటం వల్ల జరిగిన




నష్టాన్ని తెలియచెబుతున్న లేటెస్ట్ ఉదాహరణ.. నూతన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విషయంలో జరిగిన దగా!

విభజన వల్ల హైదరాబాద్ ఆదాయాన్ని కోల్పోయే పరిశేష ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి సాయాన్ని అందించాలో ఓట్లు, సీట్లు పొందిన పార్టీలు చెప్పకుండా సమైక్యాంధ్ర పేరుతో విద్వేషాల్ని రెచ్చగొట్టటంలో మునిగితేలినా.. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మాత్రం ఏపీ ఆర్థిక భవిష్యత్తు పరిరక్షణకు గట్టి కృషి చేశారు. అందుకోసం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ని అందించారు. ఈ క్రమంలోనే జనవరి 18, 2014న అసెంబ్లీలో జేపీ మాట్లాడుతూ.. ప్రత్యేక తరగతి హోదా ప్రతిపాదన చేశారు. ఇందులో జేపీ రాయలసీమకు హోదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేకసాయం అని ప్రతిపాదించారు.

### ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు రాకూడదనే ఈ రకమైన ప్రతిపాదన

రాయలసీమకే హోదాను జేపీ ఎందుకు ప్రతిపాదించారంటే, సీమలోని వెనుకబాటు తనం గణంకాలు.. ప్రత్యేకహోదా రాష్ట్రాల్లోని గణాంకాల కంటే అధ్వాన్నంగా ఉన్నాయి. "మనం ఏదైనా ఒక ప్రతిపాదనను కేంద్రానికి

చేశామంటే, అది ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వచ్చేలా ఉండకూడదు. రాజ్యాంగబద్ధంగా, ఫెడరల్ స్ఫూర్తికి అనుగుణంగా ఉండాలి" అని జేపీ స్పష్టంచేశారు. ప్రత్యేకహోదా వల్ల సీమకు పారిశ్రామిక రాయితీలు ఇస్తే.. బెంగళూరు, చెన్నై, మహారాష్ట్ర నుంచి కూడా పెట్టుబడులు వస్తాయని, ఇది కాలక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకూ లాభం చేకూరుస్తుందని, దక్షిణాదిన ఒక్క రాష్ట్రానికి కూడా హోదా లేనందున ఈ డిమాండ్‌ను మనం సహేతుకంగానే వినిపించవచ్చని వివరించారు. ఒకరకంగా మహారాష్ట్ర నుంచి తమిళనాడు కన్యాకుమారి వరకూ.. దక్కన్ ద్వీపకల్పంలోనే ఏకైక హోదాగల ప్రాంతం రాయలసీమ అవుతుందన్నారు. ఇది ఎవరూ అభ్యంతరం చెప్పలేని వాదన కూడా అవుతుంది కాబట్టి, కేంద్రానికి ఇబ్బందులుండవన్నారు.

**("అధ్యక్షా, దేశంలో 11 ప్రత్యేక ప్రతిపత్తి గల రాష్ట్రాలున్నాయి. ఈశాన్య భారతంలో 7 ఉన్నాయి, హిమాలయ సానువుల్లో మూడు ఉన్నాయి, ఇంకోటి జమ్మూ కాశ్మీర్. దాన్లో అధ్యక్షా, మనతో, మన రాయలసీమ ప్రాంతాన్ని తీసుకున్నట్టయితే, దాంతో పోల్చదగ్గ నాలుగు రాష్ట్రాలను నేను తీసుకున్నాను అధ్యక్షా. అస్సాం, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంచల్, జమ్మూ కాశ్మీర్. మిగతావి మరీ చిన్న రాష్ట్రాలు. సిక్కిం, లేకపోతే మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్, కొన్ని వేల జనాభాలో ఉన్నవి లెక్కకు తీసుకోవాల్సిన పన్లేదు. అధ్యక్షా, వీటిల్లో 3 కోట్ల 10 లక్షలేమో అస్సాం జనాభా 2011 లెక్కల ప్రకారం, 68 లక్షలేమో హిమాచల్ ప్రదేశ్ జనాభా, 1 కోటీ 1 లక్ష ఉత్తరాంచల్ జనాభా, 1 కోటీ 25 లక్షలు జమ్మూ కాశ్మీర్ జనాభా. 1 కోటీ 51 లక్షలు రాయలసీమ జనాభా అధ్యక్షా. మీరు చూడండి అధ్యక్షా, రాయలసీమను ఈ రాష్ట్రాలతో పోలిస్తే కరెక్టుగా అదేస్థాయిలో ఉందని అర్థమవుతుంది. జనసాంద్రతలో అస్సాం 397, హిమాచల్ ప్రదేశ్ 123, ఉత్తరాంచల్ 189, జమ్మూ కాశ్మీర్ 56, రాయలసీమ 225. అధ్యక్షా,** infant mortality rate. **అంటే శిశుమరణాల రేటు చూస్తే, 55 అస్సాంలో, 38,36,31 ఇతర ప్రత్యేక ప్రతిపత్తి రాష్ట్రాలలో, 44.5 రాయలసీమలో. అక్షరజ్ఞానం. 72శాతం అస్సాం, 83శాతం హిమాచల్ ప్రదేశ్, 79శాతం ఉత్తరాంచల్, 67 శాతం జమ్మూ కాశ్మీర్, 66శాతం రాయలసీమ. 2011 గణాంకాలు అధ్యక్షా, సెన్సస్ లెక్కలివి. అలాగే అధ్యక్షా, మహిళల విద్య, ఆడపిల్లల విద్య- 56శాతం అస్సాం, 67 శాతం హిమాచల్ ప్రదేశ్, 61 శాతం ఉత్తరాంచల్, 49 శాతం జమ్మూ కాశ్మీర్, 56 శాతం రాయలసీమ.**

**మనందరం కలిసి దేశం నుంచి పొందే ప్రయత్నం చేస్తున్నాం. దాని కోసం మన వాదన ఉండాలి. ఈవేళ తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర కాదు, ముగ్గురం కలిసి ఢిల్లీ మీద పోరాడి తెచ్చుకుంటే అందరికీ లాభమని చెబుతున్నాను. దయచేసి దీని మర్మాన్ని గుర్తించండి. ఇంగ్లీషులో లేదు కాబట్టి మనసు విప్పి చెబుతున్నాను. మనందరం కూడా ఇలాగా మనలో ఒకరి మీద ఒకరు వల్ల లాభం లేదు. మనందరం కలిసి ఢిల్లీ నుంచి ఎలా తెచ్చుకోవాలో ఆలోచించాలి. మిగతావాళ్లు అర్థం చేసుకున్నారు. పంజాబ్ విభజన జరిగినప్పుడు హిమాచల్ ప్రదేశ్‌ని ప్రత్యేక రాష్ట్రం చేశారు. ప్రత్యేక ప్రతిపత్తిని ఇచ్చారు వాళ్లు. మనకెందుకు ఇవ్వరు వాళ్లు అదే అంకెలుంటే ఇక్కడ. అధ్యక్షా, మంచినీళ్లు లేనటువంటి గ్రామాలు, మంచినీళ్లు లేనటువంటి ఇళ్లు అధ్యక్షా, 45శాతం అస్సాంలో, 44శాతం హిమాచల్‌లో, 42శాతం ఉత్తరాంచల్‌లో, 52శాతం జమ్మూ కాశ్మీర్‌లో, 71శాతం రాయలసీమలో. అధ్యక్షా, లెట్రిన్ లేనటువంటి ఇళ్లు 35శాతం అస్సాం, 31శాతం హిమాచల్, 34శాతం ఉత్తరాంచల్, 41శాతం జమ్మూ కాశ్మీర్, 61శాతం రాయలసీమ. అధ్యక్షా, బీదరికంలో ఉన్న కుటుంబాలు- 32శాతం అస్సాం, 8శాతం హిమాచల్, 11శాతం ఉత్తరాంచల్, 10శాతం జమ్మూ కాశ్మీర్, 28శాతం రాయలసీమ. అధ్యక్షా, తలసరి ఆదాయం- రూ.27,200 అస్సాం, రూ.50,365 హిమాచల్, రూ.59,594 ఉత్తరాంచల్, రూ.30,600 జమ్మూ కాశ్మీర్, రూ.42,000 రాయలసీమ. మళ్లీ దీన్లో కూడా మీరు హిమాచల్ కంటే, ఉత్తరాంచల్ కంటే రాయలసీమ తక్కువ అధ్యక్షా. అధ్యక్షా, ఇదే సమయంలో, ఎందుకీ విషయం తీసుకొచ్చానంటే, కేంద్రం నుంచి వచ్చే నిధుల్ని చూడండి. కేంద్రం నుంచి ఆ రాష్ట్రాలకు వచ్చే నిధుల్ని చూడండి. మన రాష్ట్రానికి గానీ, రాయలసీమకు గానీ వచ్చే నిధుల్ని చూడండి అధ్యక్షా. చాలా కీలకమైన అంశాలు అధ్యక్షా. ప్రస్తావనకు రాని అంశాలు. చర్చ కావాలి అధ్యక్షా. కేంద్రం నుంచి మనందరం కలిసి ఉమ్మడిగా సాధించుకోవాలి" అని జేపీ ఆనాడు అసెంబ్లీలో వివరించారు).**

హైదరాబాద్ ఆదాయం, విడిపోతే ఏపీకొచ్చే నష్టం తదితర అంకెల్ని తొలుత బైట పెట్టింది కూడా జేపీయే. ఆ అంకెల్నీ, హోదా తదితర ప్రతిపాదనలున్న రోడ్‌మ్యాప్‌నీ కేంద్రంలో అధికారానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ తీసుకున్నాయి. అయితే రాయలసీమకు కాకుండా మొత్తం ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదాను ప్రకటించాలని మార్పు చేశాయి.

### హోదాకి తొలి అవరోధం అప్పుడే మొదలైంది

తెలంగాణవారికి ప్రత్యేక రాష్ట్రాన్ని, ఏపీవారికి

## స్వతంత్ర భారత ఆందోళనలు రాజ్యాంగపద్ధతుల్లో ఉండాలి - డా॥ బీఆర్ అంబేద్కర్

"భారతదేశానికి ప్రజాస్వామ్యం కొత్త కాదు. ఒకప్పుడు ఈ భూభాగంవ్యాప్తంగా గణతంత్రరాజ్యాలు ఏర్పాటైన కాలం ఉంది. బౌద్ధభిక్షువుల సంఘాలను అధ్యయనం చేస్తే.. నేటి ఆధునికకాలంలో ఉన్న అన్ని పార్లమెంటరీ ప్రక్రియలను నాటి సంఘాల్లో ఆచరించినట్టుగా స్పష్టమవుతుంది. నిజానికి బౌద్ధసంఘాలకు నేటి పార్లమెంటుకు ఎటువంటి తేడా లేదు. సీట్ల అమరిక, తీర్మానాన్ని ప్రతిపాదించటం, తీర్మానాన్ని ఆమోదించటం, కోరం, విప్, బ్యాలట్ ద్వారా ఓటు వేయటం, ఓట్ల లెక్కింపు, సెన్సర్ తీర్మానం, రెగ్యులరైజేషన్ మొదలైన ప్రక్రియలన్నింటికీ సంబంధించిన నిబంధనలు బౌద్ధసంఘాల్లో ఉండేవి. వీటిని బుద్ధుడు బౌద్ధసంఘాల్లో ప్రవేశపెట్టాడంటే.. అవి ఖచ్చితంగా ఆయన కాలంనాటి రాజకీయ శాసనసభల్లో అమలవుతూ ఉంటాయని, వాటిని ఆయన స్వీకరించి ఉంటాడని మనం భావించవచ్చు. ఇటువంటి ప్రజాస్వామిక వ్యవస్థను భారత్ కోల్పోయింది. రెండోసారి కూడా కోల్పోతుందా? నాకు తెలియదు. కానీ, చాలాకాలంగా ప్రజాస్వామ్యాన్ని ఆచరించని భారత్ వంటి దేశంలో ప్రజాస్వామ్యం నియంతృత్వానికి జన్మనిచ్చే ప్రమాదం మాత్రం ఉంది. కొత్తగా పుట్టిన ఈ ప్రజాస్వామిక వ్యవస్థ తన రూపాన్ని నిలబెట్టుకుంటూనే సారంలో మాత్రం నియంతృత్వానికి దారితీసే అవకాశం పుష్కలంగా ఉంది. ఎన్నికల్లో ఒక పార్టీకే బ్రహ్మాండమైన విజయం లభించినప్పుడు ఈ రెండోరకం ప్రమాదానికి అవకాశాలు మరింతగా పెరుగుతాయి.

ప్రజాస్వామ్యాన్ని రూపంలో మాత్రమే కాదు సారంలో కూడా నిలబెట్టుకోవాలంటే మనం ఏం చేయాలి?

తొలిహెచ్చరిక: మన సామాజిక, ఆర్థిక లక్ష్యాల సాధనలో రాజ్యాంగబద్ధమయిన పద్ధతులకు తప్పనిసరిగా కట్టుబడి ఉండాలి. అంటే దీనర్థం.. విప్లవం తాలూకు హింసాయుత పద్ధతులతోపాటు పౌర ఉల్లంఘన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం వంటి ప్రక్రియలను పూర్తిగా విడిచిపెట్టాలి. ఈ పద్ధతులు అరాచకవాదానికి పర్యాయపదాల్లాంటివి. వాటిని ఎంత త్వరగా త్యజిస్తే మనకంత మేలు జరుగుతుంది.

రెండోహెచ్చరిక: ప్రజాస్వామ్య మద్దతుదార్లను హెచ్చరిస్తూ జాన్‌స్టువర్ట్‌మిల్ ఇచ్చిన పిలుపును మనం ఖచ్చితంగా పాటించాలి. "ఎంత గొప్ప వ్యక్తి అయినాసరే ఆయన పాదాల వద్ద మీ స్వేచ్ఛను ధారపోయకండి. ఎంత గొప్ప వ్యక్తి అయినా సరే మీ వ్యవస్థలను కూలదోసే అధికారాలను అతడికి అందించకండి" అని మిల్ హెచ్చరించారు. దేశం కోసం జీవితాంతం సేవలందించిన గొప్పవ్యక్తుల పట్ల కృతజ్ఞతతో ఉండటంలో ఎలాంటి తప్పు లేదు. కానీ, కృతజ్ఞతకు కూడా ఒక హద్దు ఉంటుంది. భారతదేశ రాజకీయాల్లో భక్తికి లేదా వ్యక్తి ఆరాధనకు ఉన్న ప్రాధాన్యం అంతాయింతా కాదు. మోక్షసాధన కోసం మతంలో భక్తి అవసరమేమోగానీ రాజకీయాల్లో భక్తి లేదా వ్యక్తి ఆరాధన అనేది పతనానికి, అంతిమంగా నిరంకుశత్వానికి దారితీస్తుంది.

మూడోహెచ్చరిక: రాజకీయ ప్రజాస్వామ్యానికే మనం పరిమితం కావొద్దు. మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సామాజిక ప్రజాస్వామ్యంగా కూడా మలచుకోవాలి. సామాజిక ప్రజాస్వామ్యం పునాదిగా లేకపోతే రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు."

**(భారత రాజ్యాంగాన్ని ఆమోదించటానికి ఒకరోజు ముందు నవంబర్ 25, 1949న రాజ్యాంగసభనుద్దేశించి అంబేద్కర్ చేసిన ప్రసంగం నుంచి–1)**

ప్రత్యేకహోదా రాష్ట్రాన్ని ఇచ్చేస్తే రెండుచోట్లా మనమే పవర్‌లోకి వస్తామని కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన అడ్డగోలు రాజకీయ వాదనల ఉచ్చులో ఆ పార్టీ నాయకత్వం చిక్కుకుంది. ఈ మేరకే ఫిబ్రవరి 20, 2014న అప్పటి ప్రధాని డా॥ మన్మోహన్‌సింగ్ రాజ్యసభలో ప్రకటన చేశారు. ఎక్కడ వెనకబడిపోతామోనన్నట్టు.. ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు పదేళ్లు ఉండాలని బీజేపీవారు పట్టుబట్టారు. ఏపీలో ప్రత్యేక హోదాకి తొలి అవరోధం అప్పుడే మొదలైంది. ప్రధాని ప్రకటన చేసిన వెంటనే సభలో బీహార్‌కు చెందినవారు (తాజాగా కూడా తమకు ప్రత్యేకహోదా కావాలని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మళ్లీ డిమాండ్‌ను ఎత్తు కున్నారు), మాయావతి వంటివారు అభ్యంతరం కూడా వ్యక్తం చేశారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచార సభల్లో తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పదిహేనేళ్లు ప్రత్యేకహోదా ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

### అయినా పట్టించుకోని పెత్తందారీ, అప్రజాస్వామిక రాజకీయం

ఏపీ మొత్తానికీ ప్రత్యేకహోదా ఇస్తున్నట్టు మార్చి1, 2014న యూపీయే ప్రభుత్వ కేబినెట్ తీర్మానించింది. కానీ ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావటానికి రెండు వారాల వ్యవధి ఉన్నా దాన్ని చట్టబద్ధం చేసే ప్రయత్నం చేయలేదు. ఈలోపు జరిగిన పరిణామాల్ని గమనిస్తే, ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా ఇవ్వటానికి అంకెలు, వాస్తవ పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నాయని చూచాయగానే అయినా స్పష్టంగానే అర్థమవుతుంది. రాజ్యాంగపరంగా మన వాదనలో బలం లేదని అర్థమవుతున్నా ఏదోకరకంగా మెడలు వంచి సాధించగలమని అప్రజాస్వామిక ధీమా ఉండటం వల్ల ఈ పరిణామాలు పెద్దగా పరిగణలోకి రాలేదు. అప్పటి

ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లువాలియాతోపాటు కొందరు అధికారులు ఏపీకి ప్రత్యేకహోదా పట్ల అసంతృప్తితో పక్కనపెట్టారు. ఈలోగా ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్టీకి పూర్తి మెజారిటీ రావటం, ప్రధాని పదవికన్నా బీజేపీని గెలిపించటమే తన లక్ష్యమన్నట్టు ఆయన భావించటంతో కథ వంకరలు తిరగటం మొదలైంది.

ఎన్నికలై కేంద్రంలో, తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాక కూడా ఆ లోపాన్ని సరిచేసే ప్రయత్నం చేయలేదు. రాజ్యాంగమంటే కేవలం ఏదోకరకంగా గెలిచిన ఎన్నికల ద్వారా అధికారంలోకి రావటానికి తప్ప మిగతావాటిలో దానికి పూచికపుల్ల పాటి విలువ కూడా లేదన్నట్టు పాలకులు వ్యవహరించారు. ఎన్నికల ప్రణాళికల్లోని ఉచితాలు, మాఫీలు, నిరుద్యోగ భృతి వంటి తాత్కాలిక తాయిలాల్ని మాత్రం అమలుచేస్తారుగానీ, ప్రజలకు పనికొచ్చే హామీల్ని, అవినీతిరహిత సేవల్ని, విద్య, వైద్యం, ఉపాధి, చట్టబద్ధపాలన వంటి అంశాల్ని మాత్రం అమలుచేయరు.

## 2014 చివరి నుంచే చంద్రబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించిన జేపీ

పరిస్థితిని, మన వాదనల్లోని బలహీనతల్ని గుర్తించి 2014 ఏడాది చివరి నుంచే చంద్రబాబుని జేపీ హెచ్చరించారు. ప్రత్యేకహోదాకు ఇతర రాష్ట్రాలు అడ్డం కొడతాయనే పరిస్థితి ఏర్పడుతోంది కాబట్టి, అందులోని మిగతా అంశాల్ని పక్కనపెట్టి కీలకమైన పారిశ్రామిక రాయితీల్ని సాధించుకునేందుకే వెంటనే ప్రయత్నం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎవరి ఆమోదంతో ప్రమేయం లేకుండా కేంద్ర కేబినెట్ ఒక్క సంతకంతో ఈ పనిచేసేయొచ్చని సూచించారు. అలాగే రెవెన్యూలోటు వివరాల్ని వెల్లడించాలని, కేంద్ర ప్రాజెక్టుగా చట్టంలో చేసిన పోలవరాన్ని నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసేలా మోదీ ప్రభుత్వాన్ని కోరాలని, ఇందుకు తమ వంతు పూర్తి సహకారాన్ని అందిస్తామని జేపీ బహిరంగ ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని జేపీ అసెంబ్లీలో కోరిన రెండు రోజుల్లోనే అప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత కేంద్రానికి లేఖ రాశారు. ఆ తర్వాత కూడా ఇంకో లేఖను రాశారు. ఏపీకి హోదా వల్ల వచ్చే పన్ను రాయితీల వల్ల తమ పరిశ్రమలు తెలుగు ప్రాంతానికి తరలిపోతాయేమోనన్న ఆందోళనను ఆమె వీటిల్లో వ్యక్తం చేశారు. కానీ ఏపీకి హోదా వద్దని ఆమె అనలేదు. ఈ విషయాలన్నిటినీ కూడా చంద్రబాబు దృష్టికి జేపీ తీసుకెళ్లారు. జయలలిత ఎంతో హుందాగా స్పందించారని, తమ రాష్ట్రానికి నష్టం కలగకుండా చూడాలని కోరారుతప్ప ఏపీకి ఇవ్వొద్దని చెప్పలేదని గుర్తుచేశారు. దీన్ని అవకాశంగా ఉపయోగించుకుని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఒప్పించి వెంటనే హోదా అమలు చేసేలా కేంద్రాన్ని కదిలించాలని సూచించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుకున్న పరిచయాలతో ఈ పని సులభంగానే అవుతుందన్నారు. చంద్రబాబే కాదు, కొన్ని పార్టీలు, ప్రజాసంఘాలు కూడా జేపీ రాజ్యాంగబద్ధ వ్యవహారశైలిని బలహీన వ్యూహంగా చూశాయి. మార్చి, 2015లో విభజన హామీల అమలు కోసం కార్యక్రమాల్లో భాగంగా జేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఓ ప్రాచుర్య పార్టీ ప్రతినిధిని ఆహ్వానించటానికి లోక్‌సత్తా నేతలు వెళితే.. 'మేం బాగా అధ్యయనం చేసినాక వస్తాంలే' అని ఆ పార్టీ అగ్రనేత వెటకారంగా సమాధానమిచ్చారు. ఎంత అమాయకులు, మీకు రాజకీయం తెలీదన్న వ్యంగ్యాన్ని ధ్వనింపచేశారు. కాంగ్రెస్, వామపక్ష పార్టీలు, కొన్ని ప్రజాసంఘాలు మాత్రం హాజరై సంఘీభావం తెలిపాయి.

రాజ్యాంగబద్ధంగా వ్యవహరించి వేగంగా ప్రజల ప్రయోజనాలను సాధించే అవకాశాన్ని వినియోగించుకోవటం కంటే.. అడ్డగోలు రాజకీయంతో, వ్యక్తిగత ఆర్భాటంతో, రోడ్ల మీద రచ్చ చేసి లక్ష్యాన్ని సాధించుకోవటం మీదే ఏపీలోని పలు రాజకీయ శక్తులు దృష్టి పెట్టాయి. ప్రత్యేకహోదా ఓ కోడ్ మాత్రమే, ఆ సాయాన్ని ఏ రూపంలో అందించినా మనం తీసుకోవటంలో తప్పులేదని జేపీ చెబితే.. రోజుకో మాట మారుస్తూ గందరగోళ పరుస్తున్నారని దానిపైనా కొందరు విమర్శలు, నిందలు గుప్పించారు.

## ఏపీ ప్రజల్ని మళ్లీ మోసం చేసే రాజకీయమే చేస్తున్నారా?

చివరికి నాలుగేళ్లు గడిచిపోయాక.. హోదా ఇవ్వలేదు కాబట్టి అంటూ మిత్రపక్షాలుగా ఉన్న బీజేపీ, తెదేపా తెగతెంపులు చేసుకున్నాయి. ఇంత జరిగినా ఎందుకు విఫలమయ్యామన్న ఆత్మపరిశీలన, దిద్దుబాటు లేకుండా వారంతా మళ్లీ పాతపాటే పాడుతుండటంతో విభజన సమయంలో సమైక్యాంధ్ర పేరుతో చేసిన మోసమే మళ్లీ ఏపీ ప్రజలకు జరుగుతుందన్న భయం కలుగుతోంది. పొరపాటున ఎలాగోలా వివాదం సద్దుమణిగినా, ఎన్నికలనాటికి మళ్లీ రాజేయాల్సిందేనన్నట్టు రాజకీయ శక్తులు వ్యవహరిస్తున్నాయి.

పేపర్లలో, టీవీల్లో, సోషల్ మీడియాల్లో ప్రచారం కావాలంటే, రాజకీయ లబ్ధి చేకూరాలంటే సమస్య పరిష్కారం కాకుండా సెంటిమెంట్ రగులుతూనే ఉండాలన్న దృష్టితోనే మీద పలు పార్టీలు, సంఘాలు వ్యవహరిస్తున్నాయి. హోదా ఎందుకివ్వరో చూస్తామంటూ రంకెలెయ్యటం, పార్లమెంటు వద్ద రగడ సృష్టించి దృష్టినాకర్షించి వచ్చే ఎన్నికల్లో ఏదోక లబ్ధి పొందుదామన్న ప్రయత్నం తప్ప.. రాజ్యాంగబద్ధంగా మనకున్న అస్త్రాల్ని వినియోగించుకుంటే ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుందన్న ఆలోచన చేయటం లేదు.

**బ్రిటీషువాళ్లని విమర్శించే అవకాశం ఇకమీదట మనకు ఉండదు - డా॥ బీఆర్ అంబేద్కర్**

"సామాజిక ప్రజాస్వామ్యం అనేదొక జీవనవిధానం. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అనే మూడు అంశాలను జీవనానికి అవసరమైన సిద్ధాంతాలుగా ఇది పరిగణిస్తుంది. ఈ మూడూ ఒకదాంతో ఒకటి విడదీయరానివి. వీటిలో ఏ ఒక్కదానిని తొలగించినా ప్రజాస్వామ్యానికి అర్థమే లేకుండా పోతుంది. సమానత్వం లేని స్వేచ్ఛ.. చాలామంది మీద కొందరి ఆధిపత్యాన్ని నెలకొల్పుతుంది. స్వేచ్ఛ లేని సమానత్వం వ్యక్తిగత చొరవను చంపేస్తుంది. సోదరభావం లేని స్వేచ్ఛ, సమానత్వం సహజంగా ఉండవు. వాటిని బలవంతంగా రుద్దాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.

భారతీయ సమాజంలో సమానత్వం, సోదరభావం అనేవి లేనేలేవన్న విషయాన్ని ముందుగా మనం గుర్తించాలి. 'అంతస్తులవారీగా అసమానత్వం' అనే సిద్ధాంతం మీద రూపొందించిన సమాజం భారత్‌లో ఉంది. అనేకమంది అత్యంత పేదరికంలో ఉంటే, కొద్దిమంది మాత్రం సిరిసంపదల్లో తులతూగుతున్న వ్యవస్థ ఇది. ఈ వైరుధ్యాల జీవితాన్ని మనం ఎన్నాళ్లు కొనసాగిస్తాం? సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వాన్ని ఎంతకాలంపాటు నిరాకరిస్తాం? దీర్ఘకాలంపాటు ఇలాగే నిరాకరించుకుంటూ వెళ్తే, మన రాజకీయ ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదు. ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తప్పనిసరిగా మనం తొలగించాలి. కొంతమందికి ఈ మాటలు నచ్చకపోవచ్చు. కానీ ఈ దేశంలో రాజకీయాధికారం ఎంతోకాలంగా అతికొద్దిమంది గుత్తాధిపత్యంగా ఉందని, ఆ అతికొద్దిమందిని అత్యధిక సంఖ్యాకులు నెత్తిన పెట్టుకొని భారం మోయటమేకాదు, బలి కూడా అవుతున్నారని చెప్పటం తప్పుకాదు. తీవ్రమైన అణచివేతకు గురయిన ప్రజల్లోని ఈ స్వీయచైతన్యం వర్గపోరుకు దారితీయకుండా చూడాలి. లేదంటే, చట్టసభ నిట్టనిలువునా చీలిపోతుంది. దానివల్ల జరిగేది వినాశనమే. అబ్రహాం లింకన్ చెప్పినట్లుగా, చీలిపోయి తనకు వ్యతిరేకంగా తానే నిలబడిన సభ ఎంతోకాలం ఉనికిలో ఉండలేదు. స్వాతంత్ర్యం మనమీద పెద్ద బాధ్యతలను పెట్టిందనే విషయాన్ని మర్చిపోవద్దు. ఏ తప్పు జరిగినా బ్రిటీషువాళ్లని విమర్శించే అవకాశం ఇకమీదట మనకు ఉండదు. ఇకపై జరిగే తప్పులకు మనల్ని మనమే నిందించుకోవాల్సి ఉంటుంది. తప్పులు జరిగే అవకాశాలు అనేకం ఉన్నాయి. కాలం వేగంగా మారుతోంది. మన ప్రజలు కొత్త సిద్ధాంతాలతో చైతన్యవంతులవుతున్నారు. తమ పేరిట నడిచే ప్రభుత్వాలను కాదు.. తమకోసం పనిచేసే ప్రభుత్వాలను వారు కోరుకుంటున్నారు. 'ప్రజల యొక్క ప్రజల కొరకు, ప్రజల చేత నడిచే ప్రభుత్వం' అనే సిద్ధాంతాన్ని ప్రతిష్ఠించదలచిన మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే, మన ముందుదారిలో ఉన్న దుష్టశక్తులను ఎలాంటి జాప్యం లేకుండా గుర్తించాలి. వీటిని తొలగించటంలో మనం ఎంతమాత్రం రాజీపడకూడదు. నాకు తెలిసినంతవరకూ దేశానికి సేవ చేయటానికి ఇంతకన్నా మెరుగైన మార్గం మరొకటి లేదు."

(భారత రాజ్యాంగాన్ని ఆమోదించటానికి ఒకరోజు ముందు నవంబర్ 25, 1949న రాజ్యాంగసభనుద్దేశించి అంబేద్కర్ చేసిన ప్రసంగం నుంచి-2)

## ఈ పరిణామాల్ని పరిశీలిస్తే, లోక్‌సత్తా వాదనల ప్రాధాన్యత అర్థమవుతుంది..

హోదా బదులు ప్యాకేజీ ఇస్తామన్నారంటూ చంద్రబాబు 2016 సెప్టెంబర్‌లో దానికి అంగీకరించారు. ఆ సమయంలో ఒక మౌలికమైన ప్రశ్న తలెత్తింది. హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగమా, కాదా?.. ఈ ప్రశ్నకు 'కాదు' అని కేంద్రం, చంద్రబాబు ప్రభుత్వం చెప్పాయి. పన్ను రాయితీలు లేని ప్యాకేజీని అందుకే తీసుకున్నామంటూ ఆనాడు బాబు చెప్పారు. కానీ వాస్తవానికి హోదాలో పారిశ్రామిక రాయితీలు భాగమే. లోక్‌సత్తా ఈ విషయాన్ని పలుమార్లు ప్రకటించింది. హోదా బదులు ప్యాకేజీ వల్ల ఏపీకి నష్టమేనని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చొరవతో జేపీ, ఉండవల్లి తదితరులతో విభజన హామీలపై ఏర్పాటైన జేఎఫ్‌సీ (సంయుక్త నిజనిర్ధారణ సంఘం) కూడా 2018, మార్చి 3న ప్రకటించింది. కానీ 2016లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తటంలో ప్రతిపక్ష వైకాపా, ఇతర శక్తులు విఫలమయ్యాయి. హోదా ఇవ్వాల్సిందేనంటూ వీధిపోరాటాలు చేసి రాజకీయంగా తక్షణ లబ్ధి పొందే ప్రయత్నం తప్ప.. ప్రజలకు హోదా ఫలితాల్ని వేగంగా అందించే ప్రయత్నానికి మాత్రం వారు ఉత్సుకత చూపలేదు. హోదా కంటే ప్యాకేజీతో ఇదిగో ఇంత నష్టం.. అని వారు నిర్దిష్ట ఆధారాలతో ప్రజల్లో ప్రచారం చేసి ఉంటే, అసలు కేంద్రానికి, చంద్రబాబుకి గత్యంతరం ఉండేది కాదు. ఈవేళ కేంద్రం బడ్జెట్‌లో ప్యాకేజీ సాయం తాలూకు ప్రస్తావన కూడా లేకపోవటం, వైకాపాను నిలువరించటం కోసం తెదేపా రాజకీయ ఎత్తుగడ, బీజేపీ నిర్లక్ష్యం వల్ల మళ్లీ హోదా డిమాండ్ తెర పైకి వచ్చిందిగానీ.. లేకపోతే ప్యాకేజీతో ఏపీ ప్రజలు సరిపెట్టుకోవాల్సి వచ్చేది. అంతలా ప్రజలు మోసపోయేవారు. ఈ మోసాన్ని వివరిస్తూ లోక్‌సత్తా, కొన్ని ప్రజాసంఘాలు వాదించినా, బుక్‌లెట్‌లు విడుదల చేసినా ఈ గొంతులు చాలలేదు.

## చట్టసభల్లో వైకాపా విఫలం

హోదా విషయంలో వైకాపా పోరాటాలు చేయలేదని కాదు. కానీ ఆ పోరాటాలన్నీ ప్రచారం కోసం, వ్యక్తిగతంగా, ఎన్నికల్లో లబ్ధి కోసం మాత్రమే తప్ప ప్రజలకు హోదా లాభాల్ని

అందించాలన్న తపనతో కాదు. హోదా రావటానికి ఏ సమస్యలు ఉన్నాయి, ఏం చేస్తే వాటిని పరిష్కరించవచ్చు అనే అంశాల మీద పెద్ద దృష్టి పెట్టలేదు. హోదాతో వచ్చే లాభాలకన్నా ప్యాకేజీతో వచ్చే డబ్బు తక్కువ అని వైకాపా ప్రజాప్రతినిధులు చట్టసభల్లో, బైట నిర్దిష్టంగా మాట్లాడిన దాఖలాలు లేవు. 2014 ఎన్నికల ఫలితాల రీత్యా తెలంగాణలో ప్రతిపక్షం బలహీనంగా ఉంటే, ఏపీలో బలంగా ఉంది. ఈ అవకాశాన్ని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ హోదా విషయంలో సద్వినియోగం చేసుకున్న దాఖలాలు లేవు. చంద్రబాబు ప్రభుత్వ అవకాశవాదాన్ని ఎండగట్టే ప్రయత్నం చేయలేదు. అలాగే పార్లమెంటులో కూడా అధికారపార్టీని రాజ్యాంగపరంగా ఇరకాటంలో పెట్టేలా ప్రశ్నలు సంధించలేదు. ప్రజల కోసం పోరాడుతున్నట్టు కనిపిస్తూ, కేంద్రంతో వ్యక్తిగత అవసరాల రాజీధోరణిని ప్రదర్శించారు. ఎంతసేపూ వ్యక్తిగత, ఎన్నికల రాజకీయ లబ్ధే దృష్టిగా హోదాపై వైకాపా పోరాటం సాగింది. ఆ ఎత్తుగడల్లో కూడా తప్పించుకునే ధోరణులు అనేకం. హోదా ఇవ్వకపోతే ఎంపీలు రాజీనామా చేస్తారని చెప్పి తూచ్ అన్నారు. ఎన్నికల సంవత్సరం వచ్చేశాక.. ఇప్పుడు మళ్లీ రాజీనామాలతో త్యాగం గురించి మాట్లాడుతున్నారు. హోదా ఇవ్వము అని కేంద్రం తేల్చేసినందున ప్రజల ఆగ్రహాన్ని బీజేపీ వైపు మళ్లించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని వైకాపా ఆరోపిస్తోంది. తాము మాత్రం హోదా విషయంలో రాజీలేని పోరాటం చేస్తామని చెబుతోంది. హోదా ఇచ్చే పార్టీతో పొత్తుకు సై అంటోంది. కేంద్రంలో బీజేపీయే మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో.. వైకాపా లేదా మరో పార్టీ ఏ రకంగా ఏపీకి హోదాను 2019 ఎన్నికల్లో ప్రచారాస్త్రం చేస్తారో వేచిచూడాలి. విడిపోయిన ఏపీ కంటే చుట్టుపక్కల రాష్ట్రాలకు ఎక్కువమంది ఎంపీలున్నారని మరువకూడదు.

## అవిశ్వాసంపై చేసినట్టు ప్రత్యేకహోదాపై పార్టీల్ని ఎందుకు కూడగట్టలేకపోయారు?

హోదా బదులు ప్యాకేజీ తీసుకుంటున్నానని ముఖ్యమంత్రి చెప్పినాక, హోదా ఉన్న రాష్ట్రాలకు ప్రత్యేక సాయాన్ని కొనసాగించటం మొదలుపెట్టి నెలలు గడిచిపోయాక ఇప్పుడు హోదా కావాల్సిందే అని రాష్ట్ర ప్రభుత్వం కూడా హడావుడి చేస్తుంటే ఏం విశ్వసనీయత ఉంటుంది? ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యం, వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన తాత్సారం చేశారు, అనేకమార్లు మాటమార్చారు. ఆంధ్రప్రదేశ్‌కు లక్షల కోట్లు పెట్టుబడులొస్తున్నాయి, దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమంటూ ఆర్భాటాలు చేస్తూ బడాయిలకు పోతుంటే.. ప్రత్యేకహోదా కావాలంటే అడ్డుకోవటానికి అవకాశాల్ని రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా ఇస్తున్నట్టు కాదా? హోదా పన్ను రాయితీలు కూడా ఇస్తే చంద్రబాబు ఇంకా పెట్టుబడులు తెచ్చుకుంటారని మోదీకి దుగ్ధ ఉందన్న విమర్శల్ని కూడా కొట్టిపారేయలేం. ఏపీ అంటే తాను, తన కుమారుడు, తెలుగుదేశం పార్టీ అని చంద్రబాబు అనుకోవచ్చుగానీ.. ఏపీ అంటే కోట్ల మంది ప్రజలని కేంద్రం గుర్తించొద్దా? (ప్రత్యేకహోదా సహా ఏపీకి ఈవేళ అందగా ఉన్న అనేక అంశాలు చంద్రబాబు ప్రతిపాదించినవి కావన్నది ఇక్కడ గుర్తించాల్సిన వాస్తవం). ఏపీ, తెలంగాణ అభివృద్ధి చెందితే ఇండియా అభివృద్ధి చెందదా?

పరిస్థితులు ఇలా ఉన్నా.. తగిన జాగ్రత్తలేమీ పాటించకుండా తనది '40 ఇయర్స్ ఇండస్ట్రీ' అన్నట్టు చంద్రబాబు వ్యవహరించారు. ప్రత్యేకహోదా కావాలని కేంద్రాన్ని నిర్దిష్టంగా అడిగిన దాఖలాలు లేవు. ప్రధానికి ఈ విషయమై ఒక్క లేఖ కూడా నాలుగేళ్లలో రాయలేదు (లోక్‌సత్తా గట్టిగా కోరాక.. ఢిల్లీ వెళ్లినపుడు అమరావతికి మాత్రమే పారిశ్రామిక రాయితీల్ని అడిగారు. అంటే, ఆయన దృష్టిలో అమరావతికి ప్రత్యేకహోదా వస్తే చాలన్న మాట). కాలం గడిచిపోవటంతో కేంద్రం వైఖరిలో మార్పు వస్తుండటం, ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్లు పెరుగుతుండటం గమనించాకైనా జాగ్రత్త పడలేదు. అన్ని పార్టీలనూ, సంఘాలనూ కలుపుకుని వెళ్లే ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు కూడా కేంద్రంలో ఏదో పెద్ద మార్పు వచ్చినట్టు వైదొలగాలని ప్రకటించారుగానీ, వాస్తవం వేరు. ప్రత్యేకహోదాని వైకాపా ఎత్తుకోవటంతో, హోదా ఇస్తే బీజేపీతోనైనా పొత్తుకు సిద్ధమని ప్రకటించటంతో, వైకాపా, ఇతర కొన్ని శక్తులను అడ్డంపెట్టుకుని తనను బలహీనపరచటానికి బీజేపీ కుట్ర పన్నుతోందన్న భయంతో, రానున్నది ఎన్నికల సంవత్సరం కావటంతో చంద్రబాబు ఎత్తుగడ మార్చారు. వైకాపాని కట్టడి చేయాలన్న చంద్రబాబు అభ్యర్థనను మోదీ పార్టీ ఏమాత్రం లెక్కచేయలేదు. దీంతో మోదీ ప్రభుత్వంపై తొలుత వైకాపా అవిశ్వాస తీర్మానం ఇచ్చినా, అవిశ్వాసం అవగాహన లేని పని అని తొలుత తానే తోసిపుచ్చినా, ఆ తర్వాత తెదేపాయే సొంతంగా అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించింది. నాలుగేళ్లుగా మంచివాడైన మోదీ తెదేపా అధ్యక్షుడికి రాత్రికి రాత్రి చెడ్డవారయ్యారు. అవిశ్వాసం కోసం జాతీయస్థాయిలో అనేక పార్టీలను కూడగట్టిన చంద్రబాబు.. 2015లోనే జేపీ చెప్పినట్టు ఏపీకి ప్రత్యేకహోదా కోసం ఆ పార్టీల్ని ఎందుకు ఒప్పించలేకపోయారు? వైకాపా నుంచి ముస్లిం ఓటర్లను లాగటం, పవన్ కళ్యాణ్ స్థానంలో కమల్‌హాసన్, రజనీకాంత్‌లాంటివారిని ఉపయోగించుకోవటం వంటి ఎత్తుగడల్లో బాబు ఉన్నారు. వచ్చే ఎన్నికలయ్యాక మళ్లీ కేంద్రంలో బీజేపీకి ఆయన మద్దతిచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

## తెలంగాణ ఉద్యమ సమయంలోలానే అవకాశవాద మాటలు

అలాగే, తెదేపా ఎంపీ సుజనా చౌదరి కేంద్ర మంత్రి పదవికి

రాజీనామా లేఖను ఇవ్వటానికి ప్రధాని వద్దకు వెళ్లారు. ఆ లేఖను ఇచ్చాక మీడియా అడిగిన ఓ ప్రశ్నకు జవాబిస్తూ.. రాష్ట్రానికి సంబంధించిన సమస్యల్ని ప్రధానమంత్రి స్థాయి వ్యక్తి వద్దకు ఎలా తీసుకెళ్తామని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఒకలా, ఏపీలో ఒకలా, బైట ఒకలా, లోపల ఒకలా ఎలా మాటలు మారుతున్నాయో చెప్పటానికి ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు.

ఎక్కడికో చరిత్ర పుటల్లోకి వెళ్లనక్కర్లా.. అబద్ధాలు, బాధ్యతారహిత ధోరణులు, ప్రజల ఆందోళనల పట్ల నిర్లక్ష్యభావన తీవ్ర పర్యవసానాలకు దారితీస్తాయని హెచ్చరించే అనేక పరిణామాలు ఇటీవలికాలంలోనివే ఉన్నాయి. మన కళ్ల ముందు ఇంకా తాజాగానే కదలాడుతున్నాయి. అయినా కూడా అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో బాధ్యతాయుత పదవుల్లో ఉన్న నేతలు తాత్కాలిక ధోరణులతో, రాజ్యాంగస్ఫూర్తికి తూట్లు పొడుస్తూ ప్రజలతో మళ్లీ చెలగాటమాడుతున్నారు. 14 (ఎఫ్) గురించి మర్చిపోయారా?

### 14 (ఎఫ్)పై జేపీ ఒక్కడే నిజం మాట్లాడారన్న కేసీఆర్

రాష్ట్ర విభజనకు ఆజ్యం పోసిన హైదరాబాద్ ఫ్రీజోన్ వివాదాన్ని అబద్ధాలతో దాటవేయకుండా రాజ్యాంగ ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించుకుందామని ఆందోళనలు మొదలైన సమయంలోనే లోక్‌సత్తా సూచించింది. 14 (ఎఫ్) క్లాజును తొలగించేలా చేయగలిగింది. 14 ఎఫ్‌ని తొలగిస్తే రాజకీయాల నుంచి విరమిస్తాం, సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేద్దాం, 14 ఎఫ్‌ని తొలగించటమంటే తెలంగాణ పట్ల పక్షపాతం చూపటమే.. వంటి పసలేని వాదనలు, ఆరోపణలొచ్చినా ప్రజల గోసను పట్టించుకునే విజ్ఞతతో కూడిన పరిష్కారం కోసం జేపీ కృషి చేశారు. ఆ బృహత్కార్యాన్ని కేంద్రంలో ఎటువంటి అధికారమూ లేకుండానే సాధించారు. జేపీ కృషితో హైదరాబాద్ పోలీసు రిక్రూట్‌మెంట్ జోనల్ పరిధిలోకి వచ్చేలా 1975 రాష్ట్రపతి ఉత్తర్వులోని 14 ఎఫ్‌ని తొలగించారు. దీనిపై నిర్వహించిన అఖిలపక్షంలో ఒక్క జయప్రకాష్ నారాయణ్ మాత్రమే నిజం మాట్లాడారని తెరాస అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అప్పట్లో బహిరంగంగానే చెప్పారు.

*("అధ్యక్షా, 14 (ఎఫ్)ను చూడండి. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ వల్ల 14 (ఎఫ్) రాజ్యాంగబద్ధమే అని సుప్రీంకోర్టు తీర్పునిచ్చాక, నిజానికి చాలామందికి గుర్తుండవచ్చు లేదా మర్చిపోయి ఉండవచ్చు. 14 (ఎఫ్) వచ్చాక 371 (డి) వచ్చాక, 1975-76 నుంచి 2008, 2009 వరకు కూడా ఏ ఇబ్బందీ లేకుండానే హైదరాబాద్ పోలీసు సిబ్బంది నియామకాలు కూడా జోనల్ సిస్టమ్ ప్రకారమే జరుగుతున్నాయి. ఏ కారణమన్నా కానివ్వండి. ఎవరో కొందరు ఉద్యోగులు హైకోర్టుకు పోతే హైకోర్టులో దాన్ని కొట్టివేశారు. దానిమీద సుప్రీంకోర్టుకు పోతే సుప్రీంకోర్టులో - హైకోర్టు తీర్పు కరెక్టేనూ, రాష్ట్రపతి ఉత్తర్వులు కాబట్టి ఆ ఉత్తర్వుల ప్రకారమే జరగాలి కాబట్టి జోనల్ సిస్టమ్ అమలు కావాలి అని తీర్పిస్తే ఆనాడు ఆల్ పార్టీ మీటింగ్ జరిగింది అధ్యక్షా. ఆనాడు మన ముఖ్యమంత్రిగారు స్పీకర్‌గా ఉన్నారు. కొణిజేటి రోశయ్యగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇక్కడున్న సభా నాయకులు, సభలో ఉన్నటువంటి పెద్దలంతా వారివారి పార్టీల నాయకులుగా ఉన్నారు. కేసీఆర్‌గారు ఉన్నారు, నాకు గుర్తున్నంత వరకూ చంద్రబాబు నాయుడుగారు ఉన్నారు, ఇతర పెద్దలు ఉన్నారు, నేను కూడా ఆ సభలో ఉన్నాను. ఆనాడు ఒక పెద్ద తప్పిదం జరిగింది. అధ్యక్షా, 14 (ఎఫ్)ను చట్టబద్ధం, రాజ్యాంగబద్ధం కాబట్టి అమలుచేయాలని సుప్రీంకోర్టు అన్నప్పుడు, తెలంగాణ ప్రాంతంలో దీనివల్ల మనసులో ఆందోళనలు చెలరేగినప్పుడు, పెద్దమనసుతో మనం చేయవలసిన పని 14 (ఎఫ్)ని తొలగించటం కోసం ఆనాడు ఏర్పాట్లు జరగవలసింది. అది జరక్కుండా ఆనాడు దీని మీద మనం రివ్యూ పెడదాం సుప్రీంకోర్టులో అని చెప్పి ఒక పొరపాటు చేశాం. ఏదోకరకంగా తప్పించుకునే ధోరణిలో. నేను ఆనాడే చెప్పాను - సుప్రీంకోర్టు తీర్పుని నేను జాగ్రత్తగా పరిశీలించాను. ఆ తీర్పు 14 (ఎఫ్)ని ఖచ్చితంగా అమలుచేయాలని దాని ప్రకారంగా నియామకాలు చేయాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశం కరెక్టేనని ఇచ్చింది. కాబట్టి సుప్రీంకోర్టు రివ్యూలో ఏమీ జరగదు, దీనివల్ల తెలంగాణ ప్రాంతంలో మనోభావాలు దెబ్బతింటాయి, మనసు గాయపడుతుంది అనుకున్నట్టయితే 14 (ఎఫ్)ని మనం తొలగిద్దాం అని చెబితే, రోశయ్యగారు అడిగారు- జయప్రకాష్ గారూ, ఇది సాధ్యమా? మన చేతుల్లో ఉందా? అని. అయ్యా, మనం శాసనసభ సమావేశాన్ని ఏర్పాటుచేసుకుని ప్రత్యేక సమావేశాన్ని, ఆ సభలో అన్ని ప్రాంతాలవారూ కూడా మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల మధ్యా సామరస్యం కోసం 14 (ఎఫ్) తొలగింపు తీర్మానం చేద్దాం. మనం చేద్దామంటే ఢిల్లీ వాళ్లెవరు కాదనటానికి? అని చెప్పి అంటే, దాన్ని ఉదాసీనంగా పక్కనపెట్టారు అధ్యక్షా. ఆనాడు కేసీఆర్‌గారు అక్కడే మీడియా పాయింట్ దగ్గర ఈ మాట చెప్పారు, తర్వాత సూర్యాపేటలో ఎప్పుడో మొదటి బహిరంగసభలో కూడా ఈ మాటే చెప్పారు.*

*అధ్యక్షా, సకాలంలో సరైన రీతిలో మనం స్పందించినట్టయితే ఈవేళ రాష్ట్రానికి ఈ ఇబ్బంది వచ్చేది కాదు. ఈరోజు ప్రజల మధ్య ఈ అగాధం వచ్చేది కాదు. అధ్యక్షా, ఏనుగు గదిలో ఉంది. తెలంగాణ సమస్య చాలా పెద్దసమస్యగా కోట్లాదిమంది మనసుల్లో ఉన్నప్పుడు, అది లేనట్టుగా మనం వేరే చర్చించుకోవటమన్నది సముచితం కాదు. నిజాయతీగా చర్చించుకుందాం, వాస్తవాల్ని*

## స్వపరిపాలనా పద్ధతుల్లో ఆకాంక్షల్ని నెరవేర్చుకోవాలి: జేపీ

"ప్రజలు ఎన్నికల్లో తమ ప్రతినిధులను ప్రభుత్వంగా ఎన్నుకున్నా.. ఎన్నికల మధ్య తమ ఇష్టాలు, అభిప్రాయాలకనుగుణంగా పనిచేసుకునే, ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే స్వేచ్ఛ, ఇందుకోసం సంస్థలు, సంఘాలుగా ఏర్పడే హక్కు వారికి ఉంది. అయితే ఎన్నికైన ప్రభుత్వ చట్టబద్ధ బాధ్యతను హరించే విధంగా, ప్రజాస్వామ్యం పనిచేయలేనిరీతిలో ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చే హక్కు ఈ సంస్థలకు ఉండదు. ప్రభుత్వం ఎన్నికైన మరుసటిరోజు నుంచి మనకు నచ్చినట్టు చేయటం లేదంటూ రాజ్యాంగేతర పద్ధతులను సైతం ఆశ్రయించి ఆందోళనలు చేయటం చివరికి ప్రజాప్రయోజనాలనే దెబ్బతీస్తుంది. ఎంతో శక్తిమంతమైన వ్యవస్థీకృతమైన విదేశీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటం కోసం గాంధీజీ సహాయ నిరాకరణ, బహిష్కరణ, సత్యాగ్రహ, హర్తాళ్, బంద్, నిరవధిక నిరాహారదీక్ష వంటి ఆందోళన పద్ధతుల్ని రూపొందించారు. ఆయన అసమాన వ్యక్తిత్వం వల్ల అవన్నీ గొప్ప ఆయుధాలుగా రూపొందాయి. అయితే స్వతంత్ర భారతంలో కూడా అవే ఆందోళనాపద్ధతుల్ని అనుసరించటం స్వపరిపాలన అవదు. జాతి అంతరాత్మ మీద గాంధీ ప్రభావం, స్వాతంత్ర్యోద్యమ అపురూప జ్ఞాపకాలు గాఢంగా ఉండటం వల్ల.. ఎన్నికవ్వని, విదేశీ, అప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి – మనలో నుంచే మనం ఎన్నుకున్న ప్రజాస్వామిక పాలకుల మీద పోరాటానికి పద్ధతుల మధ్య తేడాని మన ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా గుర్తించలేకపోతున్నాయి. ఆందోళనల పేరుతో ఆటంకాలు, అడ్డూఅదుపూలేని చట్టధిక్కారాలు వల్ల తలెత్తే ప్రమాదాల గురించి అంబేద్కర్ ఎంతో ముందుచూపుతో హెచ్చరించారు. భిన్న స్వరాలు, భిన్న ఆకాంక్షలు మన ప్రజాస్వామ్య వ్యవస్థ సుసంపన్నతకు అద్దం పడుతున్నప్పటికీ, వాటిని సాధించుకోవటానికి తగిన పద్ధతుల్ని మనమే గౌరవించకపోతే ఎప్పటికీ ఫలితాలు రావు." (అంబేద్కర్ ఆశించిన స్వతంత్ర భారత రాజకీయ సంస్కృతి సాధనకు జేపీ చూపిన నవ పరిష్కారాల వ్యాసాన్ని www.fdrindia.org వెబ్‌సైట్‌లో చదవవచ్చు).

*బైటపెట్టుకుందాం" అని 2014, జనవరి 18న అసెంబ్లీలో జేపీ పేర్కొన్నారు).*

### ఇతర రాష్ట్రాల్ని కూడగట్టాలి

హేతుబద్ధత, జీరో–సమ్ గేమ్‌నకు బదులు అందరి ప్రయోజనాల సమన్వయం వంటి ప్రమాణాలు అంతస్సూత్రంగా ఉన్న రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని పట్టించుకోకుండా రాజకీయం చేస్తే.. అయినంతకాలం చెలామణి అవ్వొచ్చు. కానీ అవసరార్థమైనా రాజ్యాంగపరంగా వ్యవహరించేవారు వస్తే, మన తప్పిదాలకు భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఏపీ ప్రత్యేకహోదా విషయంలో అదే జరిగింది. ప్రధానమంత్రి పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీని నెరవేర్చం అని డిమాండ్ చేసే హక్కు మనకెంతుందో, ఆ హామీని మరోరూపంలో నెరవేరుస్తామని చెప్పే హక్కు ప్రభుత్వానికి కూడా ఉందని మనం మర్చిపోకూడదు. మనం చేయాల్సిందల్లా– హోదాకు, వారిచ్చే సాయానికి మధ్య అంతరం ఉందా లేదా అని దుర్భిణీతో పరీక్షిస్తూ వేగంగా నిధుల్ని, రాయితీల్ని పొందేందుకు ప్రయత్నిస్తుండటమే! ఈ పనిచేయకుండా కేవలం రాజకీయ ప్రచార దాడి చేస్తుండటం వల్లే ఇప్పుడు కూడా వాస్తవాల చుట్టూ పోరాటాలు జరగటం లేదు. ఇంత జరిగినాక కూడా ఇప్పటికీ ఇతర రాష్ట్రాలతో ఇబ్బందిలేకుండా హోదా హామీ ప్రయోజనాల్ని సాధించుకునేందుకు చొరవ చూపకుండా తెదేపా, వైకాపా, ఇతర రాజకీయ శక్తులు కాలహరణం చేస్తున్నాయి. రాబోయే ఎన్నికల కోణంలో స్కెచ్‌లేస్తున్నాయి.

తెలుగు సెంటిమెంట్ వల్ల ఏపీకి సాయం అందిస్తే రేపు తమిళ సెంటిమెంట్, మలయాళ సెంటిమెంట్ అంటూ చాలా రాష్ట్రాలు ముందుకొస్తాయని, ఏపీకంటే వెనుకబడిన బీహార్ వంటి రాష్ట్రాలూ అడుగుతాయని కేంద్ర ఆర్థికమంత్రి ఎద్దేవా తరహాలో అన్నారు. ఎలాంటి రాష్ట్రం ఎలా అయిపోయిందని ఏపీ వాళ్లు రోషపడుతుంటే.. మీ కంటే వెనుకబడిన రాష్ట్రాలూ ఉన్నాయి, మీకెందుకంత పౌరుషం అని కేంద్రంలోని వాళ్లు తాపీగా అంటున్నారు. ప్రత్యేకహోదా ఇస్తే ఇతర రాష్ట్రాల నుంచి అభ్యంతరాలు వస్తాయని, వాటిని పరిష్కరించాలని ఆరోజు జాతీయపార్టీలకు తెలియదా? మేనిఫెస్టోల్లో కూడా పెట్టారు గదా! అప్పుడు, ఇప్పుడూ అవే పార్టీలు కేంద్రంలో అధికార, ప్రతిపక్షాలుగా ఉన్నాయి గదా! రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను కేంద్రం తీసుకోదా? కేంద్రం తల్చుకుంటే ఇతర రాష్ట్రాలను ఒప్పించలేదా? చాలాచోట్ల బీజేపీవారే గదా అధికారంలో ఉన్నది? ఇలా ఇతర రాష్ట్రాలను ఒప్పించి ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తామని 2019 ఎన్నికలకు బేరం పెడతారా? యూపీయే ప్రభుత్వం పలువురు అల్లరి చిల్లర చిన్న పిల్లలు సర్వాధికారాలు చెలాయిస్తున్నట్టు వ్యవహరిస్తే, ఎన్డీయే పాలకులు ముగ్గురు, నలుగురు పెంకి పిల్లలు సర్వాధికారాలు చెలాయిస్తున్నట్టు ప్రవర్తిస్తున్నారు. పార్లమెంటులో అవిశ్వాసంపై, రాష్ట్రంలోని ఆందోళనలు, విజ్ఞులు సైతం చేస్తున్న విమర్శలపై స్పందించి మాట్లాడాలన్న రాజకీయ ఇంగితాన్ని కూడా కేంద్రం ప్రదర్శించలేదు. ఏపీని మోసం చేయటమంటే ఇండియాలో ఓ భాగానికి చేస్తున్నట్టు కాదా? తమ సమస్యేంటో, ప్రజలకు తామిచ్చిన హామీల్ని ఏ రకంగా పరిష్కరిస్తారో ప్రజాస్వామిక సంభాషణ ద్వారా చెప్పే అలవాటు కేంద్రానికి ఉంటే అసలు విభజన సమస్యలు ఎప్పుడో పరిష్కారమైపోయేవి. 2019కి కొత్త సమస్యలు మాత్రమే మిగిలేవి.

కేంద్రం ఇతర రాష్ట్రాలను పోగేస్తూ ఏపీని ఒంటరి చేయాలని

ప్రయత్నిస్తున్నప్పుడైనా మేలుకోవాలి. కేంద్రం మరీ పెత్తందారీ ధోరణితో రాష్ట్రాన్ని లెక్కచేయకుండా వ్యవహరిస్తోంది కాబట్టి.. మనం కొంత తక్కువ తప్పులు చేసిన రాష్ట్ర పాలకులను కూడా ఇప్పుడు కలుపుకుని వెళ్లాల్సుంటుంది. అన్ని పార్టీలనూ, సంఘాలనూ కలుపుకుని సంఘటితంగా పోరాడటమంటే, వారి రాజ్యాంగ వ్యతిరేక ధోరణుల వల్ల నష్టాన్ని సమర్థించటం మాత్రం కాదు..ఇకముందైనా నష్టం జరగకుండా ఫలితాన్ని సాధించటం కోసం.

తెలుగువారు సంఘటితంగా, రాజ్యాంగపరంగా వ్యవహరిస్తూ, కేంద్రం చేసిన తప్పుల్ని, వారు చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగడితేనే, ఇతర రాష్ట్రాలనూ కూడగట్టగలిగితేనే.. అప్పుడు రావాల్సినవి పక్కగా సాధించుకోగలుగుతాం. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి కేంద్రాన్ని నిలదీస్తే ఇతర రాష్ట్రాలు కూడా అండగా నిలబడతాయిగానీ, పన్ను రాయితీల విషయంలో అవి ముందుకొచ్చే అవకాశాలు తక్కువ. పన్ను రాయితీలు ఇతర రాష్ట్రానికి ఇస్తే, తమ అవకాశాలు దెబ్బతింటాయని వారు భయపడుతుంటారు. ఇతర రాష్ట్రాలకు నష్టం కలగకుండా పరిష్కారం చూపుతూ మన పని నెరవేర్చుకునే నైపుణ్యం, నిబద్ధతతో మన పోరాటాలు ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాయానికి ఇతర రాష్ట్రాలు ఒప్పుకోకపోవటమే సమస్యయితే.. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనుకబడిన 80–100 జిల్లాలను గుర్తించి హోదా రాయితీల్ని అందించాలని జేపీ ప్రతిపాదించారు. ఇలాంటివన్నీ పరిశీలించాలి.

### ఫెడరలిజాన్ని విస్తరించే లక్ష్యాన్ని ఆయుధం చేసుకోవాలి

ఏపీలో ప్రత్యేక హోదా అంటే ఒక సెంటిమెంటే తప్ప దాని ద్వారా ఏమొస్తుందో నిర్దిష్టంగా కోట్లాదిమంది సామాన్యులకు తెలియదు. హోదా అంటే ఏమిటి, హోదాలో ఉండే అంశాలేమిటి, ప్రధానమంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనను మార్చి హోదాకు బదులుగా ఇచ్చే సాయంలో ఉండే అంశాలేమిటి, వీటిని సాధించుకోవడానికి ఇతర రాష్ట్రాలను ఎలా ఒప్పించాలి.. ఈ రాజ్యాంగ ప్రజాస్వామ్య మార్గంలో ప్రజలను చైతన్యపరుస్తూ, క్రియాశీల భాగస్వాముల్ని చేస్తూ కలసికట్టుగా వ్యవహరిస్తేనే మనం తెలుగుతేజంతో ఎదగగలుగుతాం. ఈ క్రమంలో రాజ్యాంగం ఇచ్చిన వెసులుబాటును ఉపయోగించుకుంటూ ఫెడరలిజాన్ని విస్తరించే ప్రయత్నంతో పోరాడాలి. మన రాజ్యాంగం రూపంలో ఏకీకృతమైనదైనా, స్వభావరీత్యా ఫెడరలిజానికి తొలినుంచీ అనుకూలమైనది. కేంద్రం ఏకపక్ష నిర్ణయాల్ని అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే చేయాలని రాజ్యాంగ నిర్మాతలు స్పష్టంచేశారు. ఫెడరలిజాన్ని పెంచే లక్ష్యం హోదా పోరాటానికి ఆయుధం కావాలి. ఇతర రాష్ట్రాల మద్దతును పొందటానికి ఉమ్మడి ప్రాతిపదిక కావాలి.

2014లో రాష్ట్ర విభజన సమయంలో కూడా.. కేంద్రం ఏకపక్షంగా రాష్ట్రాన్ని విభజించకూడదని, భాగస్వాములైన అన్ని ప్రాంతాలవారినీ కూర్చోబెట్టి సమగ్ర సామరస్య పరిష్కారాన్ని సాధించాలని, ఫెడరల్ స్ఫూర్తికి పట్టం కట్టాలని లోక్‌సత్తా విస్పష్టంగా గళం విప్పిన సంగతి గుర్తుండే ఉంటుంది.

*("అధ్యక్షా, పూంఛీ కమిటీ ప్రస్తుతం జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న యు.పి.ఎ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ. వారి కమిషన్, మా పరిపాలనా సంస్కరణల సంఘం విజ్ఞాన్ భవన్ ఎనెక్స్ నుంచే పనిచేశాయి కాబట్టి మేం చూశాం వారిని. వాళ్ల బోర్డు చూసి వారితో అప్పుడప్పుడూ మాట్లాడుతుండేవాళ్లం. వారేమన్నారు అధ్యక్షా–*In practice it is rarely possible for the parliament to ignore the views of the state. The Central Government can not concede to the demand for *a seperate state unless such a proposal is received from the state. అధ్యక్షా, ఇది సాంప్రదాయం అని మర్చిపోకూడదు. ఖచ్చితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలి. నాకు ఏ మాత్రం అనుమానం లేదు. దానికి మార్గం కూడా చెబుతాను. మూడో అంశం లోకి వస్తాను. కానీ రాష్ట్రంలో అందరినీ ఒప్పించి చేయాలి తప్ప బలవంతంగా మేం ప్రభువులం, మాది రాచరికం లేదా మాది సామ్రాజ్యం, మీరు మా మాట వినాల్సిందే అంటే అధ్యక్షా, చాలా ప్రమాదం వస్తుంది.*

*ఉదాహరణకి, రాయల తెలంగాణ ప్రతిపాదన వచ్చింది. తెలంగాణ ప్రాంతమంతా ఏమన్నది వెంటనే?– మాతో మాట్లాడకుండా, మమ్మల్ని సంప్రదించకుండా, మా అభిప్రాయాల్ని పరిగణలోకి తీసుకోకుండా, మా అభిమతాన్ని పట్టించుకోకుండా, మమ్మల్ని ఒప్పించకుండా మీరెవరు ఇష్టమొచ్చినట్టు చేయడానికి అని తెలంగాణ ప్రాంతమంతా బంద్‌కి దిగింది అధ్యక్షా. ఇది అందరికీ వర్తిస్తుంది. రేపొద్దున ఏ రాష్ట్రం ఏర్పడినా కూడా ఢిల్లీకి పూర్తి పెత్తనమిచ్చేసి ఏనాడు ఏ ఇష్టమొచ్చినట్టయినా చేసేయొచ్చు పార్లమెంటులో మెజారిటీ ఉన్నంతకాలం అన్నట్టయితే అధ్యక్షా, ఇంక సమాఖ్య వ్యవస్థ నిలవదు. ఇది యూనిటరీ వ్యవస్థ అవుతుంది. భారతదేశం చాలా ప్రమాదంలో పడుతుంది. కాబట్టి తెలంగాణ సోదరులకు విజ్ఞప్తి చేస్తున్నాను– ఈవేళ మూడు ప్రాంతాలనూ కలిసి ఒప్పించాలి. ఎలా ఒప్పించాలో ఇప్పుడే చెబుతాను. మీరేమీ ఆందోళన పడక్కర్లేదు. ఏ రకంగా ఒప్పించాలో, దానికి పరిష్కారమేమిటో మీ ముందు పెడతాను" అని అసెంబ్లీలో జేపీ అన్నారు).*

### హోదా లేబుల్ పరిరక్షణకన్నా..

### హోదా ద్వారా ప్రజాప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడిన లోక్‌సత్తా

ప్రత్యేక హోదా డిమాండ్‌ను సజీవంగా ఉంచటంలో వివిధ

పార్టీలు, సంఘాల కృషి ఉందనటంలో సందేహం లేదు. కానీ వారు ప్రధానంగా ప్రత్యేక హోదా పేరు (లేబుల్)ను పరిరక్షించటానికి ప్రయత్నిస్తే, పేరు ఏదైనా హోదా ప్రయోజనాలు ప్రజలకు దక్కాలని లోక్‌సత్తా గట్టిగా కృషి చేసింది. ప్రత్యేక హోదా ప్రతిపాదన చేసిందీ, పేరు ఏదైనా ఆ ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు దక్కాలని నిర్దిష్టంగా ప్రయత్నిస్తున్నదీ లోక్‌సత్తా. హోదా పద్దు కింద చాలా ఇచ్చాం అని కేంద్రం, చాలా తక్కువ ఇచ్చారని రాష్ట్రం కాలక్షేపం చేస్తుంటే, ఏమిచ్చినా హోదాయే ఇవ్వాలని పలు పార్టీలు, సంఘాలు ఆందోళనలు చేస్తుంటే.. వాస్తవాల్ని వెలికితీసి ప్రజల్లో గందరగోళాన్ని తొలగించేందుకు జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పాటైన జేఎఫ్‌సీలో కూడా లోక్‌సత్తా కీలకపాత్ర పోషించింది.

## వాళ్లు నాలుగేళ్లుగా చేయలేని పనిని జేఎఫ్‌సీ రోజుల్లో చేసి చూపింది

2014లో తెలుగుదేశం, బీజేపీకి మద్దతు పలికిన పవన్ కళ్యాణ్.. హోదా, ఇతర విభజన హామీల అమలుపై ఆలస్యంగా మేలుకొన్నారనటంలో సందేహం లేదు. కానీ చిత్తశుద్ధితో పార్టీలకతీతంగా ముందుకురావటంతో ఆయనకు లోక్‌సత్తా తన వంతు సహకారాన్ని అందించింది. నాలుగేళ్లుగా ప్రభుత్వాలు, ఓట్లు సీట్లు పొందిన పార్టీలు చేయలేని పనిని జేఎఫ్‌సీ కేవలం 14 రోజుల్లో చేసి చూపింది. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు తాము ప్రత్యామ్నాయం కాదు అని స్పష్టంచేస్తూనే.. ఉన్న సమాచారంతోనే 7 కీలక రంగాల్లో గణించదగ్గ వివరాలను స్పష్టంగా బైటపెట్టింది. ఎంతో ఇచ్చామని కేంద్రం, ఏమీ ఇవ్వలేదని రాష్ట్రం చేస్తున్న వాదనల మధ్య కీలకాంశాలపై ప్రజల్లో గందరగోళాన్ని తొలగించింది. ప్రత్యేకహోదా అంటే ఏమిటో వివరించి.. పన్ను రాయితీలు అందులో భాగమేనని వివాదాలకు తెరదించింది.. ఇవే గదా అసలు సమస్యలు?!

ప్రత్యేక హోదా చుట్టూ ఆందోళనలతో హడావుడి సృష్టిస్తున్న వారందరికన్నా.. జేఎఫ్‌సీ గొప్ప కృషి చేసిందంటే, అందుకు పూర్తిగా ప్రజల్లో అవగాహన పెంచుతూ వారి భాగస్వామ్యంతో పాలనని, రాజకీయాన్ని నడపాలనే రాజ్యాంగ ప్రజాస్వామిక పంథాను అనుసరించటమే అందుకు కారణం. సరైన మార్గంలో ఫలితాల్ని సాధించేందుకు అనేక అవకాశాలుండగా, ఏ అవకాశమూ లేదన్నట్టు రోడ్లెక్కి దిగ్బంధాలు చేయటం ఏ రకమైన రాజకీయం, ప్రజాస్వామ్యం? (చివరిదశలో ఇలాంటి ఆందోళనల్ని చూసీచూడనట్టు వదిలేయొచ్చు. కానీ తొలినుంచీ ఇవే పద్ధతుల్లో చేస్తున్న పార్టీలు, సంస్థలు ఉన్నాయి. కాకపోతే, గతంలోలా కాకుండా.. కొంతమేర ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆందోళనలు చేయటం కాస్త మెరుగు అనుకోవాలి). ఇది ప్రజల్లో గందరగోళాన్ని మరింత పెంచుతోంది. ప్రజలకు స్వేచ్ఛాయుత ఓటు, భావప్రకటనా హక్కులు ఉన్నప్పుడు, ఆ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలే అధికారంలో ఉన్నప్పుడు, నిర్దిష్ట రాజ్యాంగ పద్ధతుల్లో వారిని నిలదీసే అవకాశం ఉన్నప్పుడు.. రాజ్యాంగవిరుద్ధ ఆందోళనాపద్ధతులు కేవలం రాజకీయ స్కూల్ డ్రాపవుట్ల తరహా అపరిపక్వ ప్రజాస్వామిక వ్యవహారశైలి అవుతుంది. జేఎఫ్‌సీ చేసింది నిజమైన జనరాజకీయం.

## రాజకీయ గడుసుదనాన్ని వీడి రాజ్యాంగ ప్రజాస్వామ్యం అవసరాన్ని గుర్తిద్దాం

రాజ్యాంగ ప్రజాస్వామ్య మార్గం అసమర్థుల పద్ధతి అంటూ ఆలోచనలేకుండా గడుసుదనం చూపిస్తే, జరిగినంతకాలం పనులు జరుగుతుంటాయి, తేడా వస్తే రోషపడి చివరకు రాజీపడుతుంటాం. రాష్ట్ర విభజన నుంచి ప్రత్యేకహోదా వరకు పలు విషయాలు ఆ పాఠాల్ని గత కొన్నేళ్లలో మనకు నేర్పించాయి. ఏపీ మొత్తానికీ ప్రత్యేక హోదా ఇవ్వటానికి ఇతర రాష్ట్రాల నుంచి సమస్యలు ఉన్నాయనుకుంటే.. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణ సహా దేశవ్యాప్తంగా వెనుకబడిన 80-100 జిల్లాలను గుర్తించి హోదా రాయితీల్ని అందించాలని జేపీ చేసిన ప్రతిపాదన వల్ల కేంద్రం ఓ గంభీర సమయంలో పార్లమెంటులో ఇచ్చిన హామీ నెరవేరి ఏపీకి గణనీయ లబ్ధి చేకూరుతుంది. ప్లస్.. దేశంలోని అనేక ప్రాంతాలకూ లబ్ధి కలుగుతుంది. కానీ.. ఇది కూడా ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రమేయం లేకుండా వారి రాష్ట్రాన్ని విభజించినందుకు ప్రత్యేకించి ఇస్తున్న పరిహారం అవదు. పార్లమెంటులో, ఎన్నికల్లో ఇచ్చిన హామీల పట్ల, ప్రజల హక్కుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాటి అమలుకు ముప్పతిప్పలు పెట్టే పార్టీలకు బుద్ధి చెప్పేందుకు తగిన పాలనా, ఎన్నికల సంస్కరణల కోసం మరోకోణంలో పోరాటాలు చేయాలి. పార్లమెంటు వెల్‌లోకి వెళ్లి ఆందోళనలు చేస్తే తప్పు పట్టించుకోరు అనే పరిస్థితి నుంచి చట్టసభల్ని ప్రక్షాళన చేయాలి. ఎన్నికల్లో నోటికొచ్చినట్టు పార్టీలు చేస్తున్న హామీల పట్ల ప్రజలు ఇకనైనా అప్రమత్తంగా ఉండాలి. రాజ్యాంగం గ్యారంటీ ఇచ్చిన ఓటుహక్కు, భావప్రకటనా స్వేచ్ఛ ఉన్న దేశంలో ఇవేమీ అసాధ్యం కాదు.

అంబేద్కర్ వంటి మహనీయులు దూరదృష్టితో సూచించిన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక పద్ధతుల్లో (రాజ్యాంగంలో ఉన్న లోపాల్ని సరిచేయటం వేరే చర్చ) సుస్థిర విజయాల్ని సాధించటమా? రాజకీయ గడుసుదనంతో తరచూ పెనం మీద నుంచి పొయ్యిలో పడుతుండటమా?.. ఏదో మనం ఆలోచన చేయాలి, తేల్చుకోవాలి. మున్ముందు (ఈ విశ్లేషణ రాసే సమయం తర్వాత) ప్రత్యేక తరగతి హోదాపై మళ్లీ ఎలాంటి ప్రకటనలు, హామీలైనా రావచ్చు, రాజకీయ సమీకరణాలు మారొచ్చు.. కానీ ఈ వ్యాసంలోని ఒక్క వాక్యాన్ని కూడా వెనక్కి తీసుకోవాల్సిన అవసరం లేదు. కొత్త హామీల ద్వారా లబ్ధి పొందేందుకు కూడా ఇలా రాజ్యాంగ ప్రజాస్వామిక అవగాహనే కీలకం.. హోదాపై ఈ మథనం, దిద్దుబాటుతో కూడిన కార్యాచరణ బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మదినోత్సవాన్ని (ఏప్రిల్ 14) ఘనంగా జరుపుకోవటానికి ఓ నిర్మాణాత్మక మార్గం. ❑

# మహాత్ముడూ చంపారన్ ఆంగ్లేయులూ


**(చంపారన్ @ 100+)**

**- రామచంద్ర గుహ,** చరిత్రకారుడు

*'గాంధీ భావాలు కేవలం ప్రాచ్య ప్రపంచానికి చెందినవే అయితే ఆయన వాటిని తన వ్యక్తిగత జీవితానికి వర్తింపచేయడంతో సంతృప్తి పడేవారు. పాశ్చాత్య భావాల ప్రభావమే ఆయన్ని ఒక క్రియాశీల సాంఘిక సంస్కర్తగా రూపొందించింది'*


**- డబ్ల్యు.బి.హేకాక్**

మహాత్మాగాంధీ 1917 వేసవిలో నీలిమందు రైతుల స్థితిగతులను అర్థం చేసుకోవడానికి చంపారన్ ప్రాంతంలో పర్యటించారు. ఆ పర్యటనలో ఆయన పొందిన అనుభవాలు, నేర్చుకున్న పాఠాల గురించి ఇప్పటికే ఒక కాలమ్‌లో ('చంపారన్'తోనే గాంధీ ప్రస్థానం) విశ్లేషించాను. గాంధీజీ పర్యటనను వ్యతిరేకించిన వారి గురించి ప్రస్తుత కాలమ్‌లో వివరిస్తాను. చంపారన్‌లో మహాత్ముని సత్యాగ్రహ ఉద్యమం వల్ల అధికంగా నష్టపోయినవారు నీలిమందు తోటల యజమానులు. వీరందరూ న్యాయవాదులు, మతాచార్యులు, సైనికాధికారుల కుమారులు. సమాజంలో వీరికి గల గౌరవ ప్రతిపత్తులు ఐసీఎస్ అధికారులకు లభించే వాటికంటే తక్కువస్థాయివే. అయితే వీరి జీవన ప్రమాణాలు చాలా ఉన్నతస్థాయిలో ఉండేవి. ఇండిగో ప్లాంటేషన్ (నీలిమందు తోట) మేనేజర్‌కు నెలసరి వేతనంతోపాటు ఫ్యాక్టరీ లాభాలలో వాటా ఉండేది. ఆయిల్, ఫ్యూయల్ ఉచితం. ఆహారధాన్యాలు, కూరగాయలు మొదలైనవి కూడా తరచు ఉచితంగానే లభించేవి. చంపారన్ గ్రామీణ సీమలు అనేకానేక వన్యప్రాణులకు నెలవులు. పతకాలకు పులులు, చిరుతలను వేటాడేవారు. విందుకు జింకలు, కౌజులు లభించేవి.




1917 వేసవిలో చంపారన్‌కు గాంధీజీ రాకతో ఇండిగో ప్లాంటర్లకు మంచిరోజులు ఇంకెంతకాలం ఉంటాయనే ప్రశ్న తలెత్తింది. ఎందుకంటే నీలిమందు నిర్బంధసాగును గాంధీజీ తీవ్రంగా వ్యతిరేకించారు. గాంధీ రాకతో చంపారన్‌లో అశాంతి, నేరాలు పెరిగిపోయాయని యూరోపియన్ డిఫెన్స్ అసోసియేషన్ స్థానిక శాఖ ఒక తీర్మానంలో పేర్కొంది. గాంధీ పర్యటనను కొనసాగనిస్తే చంపారన్‌లోని యూరోపియన్ల సంక్షేమానికి, జిల్లా ప్రజల సంక్షేమానికి తీవ్ర హాని జరుగుతుందని ఆ తీర్మానం ఆందోళన వ్యక్తం చేసింది. బెట్టియరాజ్ అనే ప్లాంటేషన్ మేనేజర్ గాంధీ పర్యటన పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. 'గాంధీ నిజాయతీవరుడే కావచ్చుగానీ, దక్షిణాఫ్రికాలో లభించిన విజయాలతో ఆయన తనను తాను ఎక్కువగా ఊహించు కుంటున్నాడు. గాంధీని తేలిగ్గా అమరవీరుడిని చేయవచ్చుగానీ అణచివేయడం సాధ్యం కాదని' ఆ బ్రిటిష్ ప్లాంటర్ అభిప్రాయపడ్డాడు. గాంధీని తొలినుంచి ఒక స్థిరవైఖరితో వ్యతిరేకించిన చంపారన్ ప్లాంటర్ డబ్ల్యుఎస్ ఇర్విన్. బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా ఉండే వార్తాపత్రికలకు ఆయన వరుసగా రాసిన వ్యాసాలలో యూరోపియన్ ప్లాంటర్లు అడవిని అనేక కష్టనష్టాలతో సేద్యయోగ్యభూమిగా మార్చివేశారని వాదించాడు. గాంధీ వచ్చే వరకు చంపారన్ రైతులు పూర్తి సంతృప్తితో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గాంధీ ఉద్యమ లక్ష్యశుద్ధిని ఇర్విన్ ప్రశ్నించారు. ఆయన పద్ధతులు మరింత తక్కువ నాటకీయతతో ఉన్నట్టయితే ఉద్యమ లక్ష్యాలపై సందేహాలు ఏర్పడేవని ఆ బ్రిటిషర్ అభిప్రాయపడ్డాడు.

1917 ద్వితీయార్థంలో గాంధీ సతీమణి కస్తూర్బా చంపారన్‌లో భర్త వద్దకు వచ్చారు. కస్తూర్బా రాక ఇర్విన్‌కు మరింత ఆగ్రహం తెప్పించింది. కలకత్తా దినపత్రిక స్టేట్స్‌మన్‌కు రాసిన ఒక లేఖలో బహిరంగ కార్యకలాపాలలో పాల్గొననని కమిషనర్‌కు హామీ ఇచ్చిన గాంధీ గోవధ, హిందూ-ముస్లిం సంబంధాలపై వివాదాస్పద ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదిలావుండగా శ్రీమతి గాంధీ ఇటీవల ఒక పాఠశాలను ప్రారంభించే మిషతో ఒక బజార్‌ను ప్రారంభించారు. ఫ్యాక్టరీకి చెందిన రెండు ఇరుగు పొరుగు



బజార్లను మూసివేయించడానికే ఆమె ఆ పనిచేశారు. ప్రభుత్వానికి ఇచ్చిన హామీకి నిజాయతీగా కట్టుబడి ఉండడానికేనా గాంధీ ఇదంతా చేస్తుంది? అని ఇర్విన్ ప్రశ్నించారు. గాంధీ వెన్వెంటనే స్టేట్స్‌మన్‌కు రాసిన ఒక లేఖలో ఈ ఆరోపణలకు సమాధానమిచ్చారు. హిందూ-ముస్లింల మధ్య ఉద్రిక్తతలను తొలగించి సమైక్యతను నెలకొల్పడానికే తన ప్రసంగాలను ఉద్దేశించానని గాంధీ పేర్కొన్నారు. ఆ తరువాత తన భార్యపై వచ్చిన ఆరోపణ గురించి ప్రస్తావిస్తూ అమాయకురాలైన తన భార్యకు ఆ ఆరోపణ గురించి తెలియనే తెలియదని గాంధీ అన్నారు. ఇర్విన్‌ను, తన భార్య కస్తూర్బాకు పరిచయం చేస్తానని, అతనికి తన భార్య చాలా సాధారణ మహిళ అని, దాదాపు నిరక్షరాస్యురాలని, తాను ప్రస్తావించిన రెండు బజార్ల గురించి ఆమెకు తెలియనే తెలియదనే వాస్తవం అతనికి తెలిసివస్తుందని గాంధీ పేర్కొన్నారు. ఉపన్యాసాలు చేయడం లేదా పత్రికలకు లేఖలు రాసే కళను శ్రీమతి గాంధీ ఇంకా నేర్చుకోలేదని ఎత్తిపొడుస్తూ గాంధీ తన లేఖను ముగించారు.

చంపారన్‌లోని నీలిమందు తోటల యజమానులు గాంధీ పట్ల బద్ధవ్యతిరేకతతో వ్యవహరించినప్పటికీ ప్రభుత్వాధికారులు మాత్రం గుజరాత్ నుంచి వచ్చిన ఈ సందర్శకుడిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించారు. గాంధీ చంపారన్‌కు వచ్చిన పక్షంరోజుల అనంతరం సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ ఒకరు ఇలా వ్యాఖ్యానించారు: 'నీలిమందు తోటల యజమానులు సహజంగానే గాంధీని తమ సహజ శత్రువుగా పరిగణిస్తున్నారు. యూరోపియన్లు తమ తమ నిర్దిష్ట అభిప్రాయాల ప్రకారం గాంధీని ఒక ఆదర్శవాది, ఒక మతమూఢుడు లేదా ఒక విప్లవవాదిగా చూస్తున్నా రైతులు మాత్రం ఆయన్ని తమ విమోచకుడిగా గౌరవిస్తున్నారు. గాంధీకి అసాధారణ శక్తులున్నాయని వారు విశ్వసిస్తున్నారు. గాంధీ గ్రామాలలో పర్యటిస్తున్నాడు. తమ ఇక్కట్లు ఏమిటో వివరించాలని గ్రామీణలను ఆయన కోరుతున్నాడు. రామరాజ్యం రాబోతుందనే దార్శనికతతో నిత్యం వారి ఆలోచనలను ఆయన ప్రభావితం చేస్తున్నాడు.'

గాంధీని నిష్పాక్షికంగా అర్థం చేసుకున్న ఆంగ్లేయుడు 1917 వేసవిలో చంపారన్ సత్యాగ్రహోద్యమంలో జిల్లా మెజిస్ట్రేట్‌గా ఉన్న అధికారి. గాంధీ, చంపారన్‌లో ఉన్నకాలంలో ఈ ప్రభుత్వాధికారి అంతకంతకూ ఆయన పట్ల ఆకర్షితుడయ్యారు. గాంధీ మాటల పట్ల విశేష శ్రద్ధాసక్తులు చూపించాడు. ఆయన గాంధీతో సంభాషించారు. గాంధీ గురించి ఇతరులతో మాట్లాడారు. అంతేకాదు అప్పటికి గాంధీ రాసిన వివిధ పుస్తకాలు, కరపత్రాలు మొదలైనవి తెప్పించుకుని చదివారు. తన ప్రతిస్పర్థి గురించి ఆ ఆంగ్లేయుడు ఇలా రాశారు: 'ప్రాచ్య, పాశ్చాత్య భావ స్రవంతుల అపురూప మిశ్రమంగా గాంధీ కనిపిస్తున్నాడు. జాన్ రస్కిన్, టాల్‌స్టాయి రచనలు, బోధనలచే ఆయన ప్రభావితమయ్యాడు. ముఖ్యంగా టాల్‌స్టాయ్ ప్రభావం మరీ ఎక్కువ. వాటికి ఒక యోగి తపస్వితను గాంధీ జతచేశారు. గాంధీ భావాలు కేవలం ప్రాచ్య ప్రపంచానికి చెందినవే అయితే ఆయన వాటిని తన వ్యక్తిగత జీవితానికి వర్తింపచేయడంతో సంతృప్తి పడేవారు. పాశ్చాత్య భావాల ప్రభావమే ఆయన్ని ఒక క్రియాశీల సాంఘిక సంస్కర్తగా రూపొందించింది.' వ్యక్తిగా గాంధీ, ఆయన ఉద్యమం, ఆయన పద్ధతి గురించి ఇది ఒక అసాధారణ అంచనా. ఈ ఐసీఎస్ అధికారి చాలాకాలం క్రితమే విస్మృతుడయ్యాడు. అయితే చంపారన్ సత్యాగ్రహ శతవార్షికోత్సవం సందర్భంగా ఆయన్ని తప్పక గుర్తుచేసుకోవాల్సిన అవసరమున్నది. అతని పేరు డబ్ల్యు.బి. హేకాక్. చంపారన్‌లోని ఆయన సహచర యూరోపియన్లు గాంధీ నుంచి ఎదురైన సవాల్‌ను ఆగ్రహం, భయం, జాత్యహంకారంతో ఎదుర్కొన్నారు. అయితే హేకాక్ వాటికి దూరంగా ఉండి గాంధీని నిష్పాక్షికంగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించినందుకు మనం ఆయన్ని తప్పక గుర్తుచేసుకోవాలి.

(భారత్‌లో గాంధీజీ 'సృజనాత్మక ఒత్తిడి' ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించిన 'చంపారన్'కు ఈ ఏప్రిల్‌లో 101 సంవత్సరాల సందర్భంగా)

*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)* ❑

# మహాత్ముడిలో విప్లవం



**-ఏబీకే ప్రసాద్,** సీనియర్ సంపాదకులు

*'గాంధీజీ ఒక రాజకీయ నాయకుడే కాదు, ఒక రాజనీతిజ్ఞుడే కాదు, ఆయనొక ప్రవక్త. ప్రవక్త తన కాలంలో తరచూ విఫలమవుతూ ఉంటాడు. కానీ ఆయన వైఫల్యాల నుంచీ ఆయన త్యాగాల నుంచీ మానవాళి చిరంతనమైన విలువను సంతరించుకుంటుంది. అనితర సాధ్యమైన ఆ విలువే ప్రవక్త జీవితాన్ని ప్రకాశవంతం చేస్తుంది. అది మానవజాతికి కాలావధులు లేని విశ్వజనీన పాఠమై సేవ చేస్తుంది. కమ్యూనిస్టు మార్క్సిస్టు సిద్ధాంతాల వెలుగులో కూడా భారత కమ్యూనిస్టులు గాంధీజీని విశ్లేషించడంలో ఘోరతప్పిదం చేశారు.'*

*– 'రివల్యూషనరీ గాంధీ' (2012) గ్రంథంలో పన్నాలాల్‌దాస్ గుప్తా (1948 వరకు అవిభక్త భారత రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి).*

*'ప్రపంచ ప్రజలు ముందడుగు వేస్తున్నకొద్దీ, భూప్రపంచం శాంతి కోసం తపన పడుతున్నకొద్దీ, ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణం వెల్లివిరుస్తున్నకొద్దీ గాంధీజీ వాణి ఎప్పటికన్నా ఎక్కువగా, విస్పష్టంగా ధ్వనిస్తుంటుంది. ఆయన భావాలపైన ఎలాంటి పేరు, ఇంటి చిరునామా తెలిపే చీటీ అంటించనక్కర్లేదు– ఒక్క మానవతావాదమనే సువిశాల ముద్ర తప్ప!'*

*– 'గాంధీజీ' (పే.209) గ్రంథంలో ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ (సుప్రసిద్ధ కమ్యూనిస్టు నేత, ఎంపీ, చరిత్రకారుడు)*

విభిన్న జాతులు, మతాలు, భాషా మైనారిటీలు, భిన్న తెగలు, దళిత బహుజనుల సమాహారంగా ఉన్న భారతావనిని స్వేచ్ఛ కోసం ఒక్క తాటిపై నడిపించినవారు గాంధీజీ. అలాంటి గాంధీజీని ఏ మిషతో గాడ్సే, అతడి 'హిందూరాష్ట్ర' వాదులు కొందరు హత్య చేశారో కొంత ఆలస్యంగానే వెలుగులోకి వచ్చింది. 'గాంధీని నేనెందుకు హత్య చేశాను?' పేరుతో గాడ్సే కోర్టు వాంగ్మూలం పుస్తకరూపంలో వెలువడింది. గాంధీ హత్య కేసును విచారించిన ప్రత్యేక కోర్టులో గాడ్సే ఇచ్చిన వాంగ్మూలమది. మొదట దీనిని నిషేధించారు. 1968లో బొంబాయి హైకోర్టు ఆ నిషేధాన్ని ఎత్తివేసింది. 2014 తరువాత బీజేపీ–పరివార్ ప్రభుత్వం ఆవిర్భవించిన తరువాత ఇది మరోసారి వెలువరించారు. గాంధీజీని హత్య చేయడానికి 'హిందూరాష్ట్ర'కు దొరికిన కారణాన్ని అందులో (పేజీ:45) ప్రకటించారు: దేశ విభజన తరువాత పాకిస్తాన్‌కు రూ.55 కోట్లు పరిహారం ఇవ్వాలని ఇండియాను ఒత్తిడి చేస్తూ గాంధీ నిరాహారదీక్ష చేయాలని నిర్ణయించుకున్నారన్న వార్త అన్ని దేశ భాషా వార్తా మాధ్యమాలలో ప్రసారమవుతున్న ఘడియలవి. ఆ సమయంలో నాథూరామ్ గాడ్సే, నారాయణ ఆప్టే (మరాఠీ దినపత్రిక హిందూ రాష్ట్ర పత్రిక సంపాదక, మేనేజర్లు) తమ కార్యాలయంలో కూర్చుని టెలిప్రింటర్ మీద వస్తున్న ఆ వార్తను చదువుతు 'గాంధీని చంపేయాలని ఆకస్మికంగా నిర్ణయించుకున్నారు'.

**రివల్యూషనరీ గాంధీ**

దేశ విభజనతో శాశ్వత కల్లోలానికి అంకురార్పణ చేసిన కాంగ్రెస్ నాయకత్వాన్ని సహితం ఎదిరించి పరువు నిలిపినవారు గాంధీ. ఎన్ని రకాల ఆటుపోట్లను ఎదుర్కొని ఆయన తుదిశ్వాస వరకు జాతీయోద్యమాన్ని సాగించారో వివరించే మరో గ్రంథం 'రివల్యూషనరీ గాంధీ'. పన్నాలాల్‌దాస్ గుప్తా ఈ చారిత్రక గ్రంథాన్ని రచించారు. అవిభక్త బెంగాల్ రివల్యూషనరీ భారత కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా 1948 వరకు ఆయన పనిచేశారు. తరువాత పార్టీ నుంచి విడిపోయారు. జాతీయోద్యమ సమయంలో ఆవిర్భవించిన పార్టీలు ఎన్నో! ఎందరో ఉద్యమకారులు పనిచేశారు. అలాంటి దశలో అనుసరించవలసిన వ్యూహాలు, ఎత్తుగడల విషయంలో వ్యత్యాసాలు, వైరుధ్యాలు సహజం. అనేక దేశాల జాతీయోద్యమాలను ఇలాంటి పరిణామాలే ప్రభావితం చేశాయి.

అంతా పన్నాబాబు అని ప్రేమగా పిలుచుకునే పన్నాలాల్‌దాస్ గుప్తా వేలు విడిచిన విప్లవకారునిగా, మార్క్సిస్టు మేధావిగా గాంధీజీ (విప్లవ గాంధీ)కి అర్పించిన అక్షర నివాళే ఈ రచన. ఉద్యమ అనుభవాలు ఇచ్చిన పూర్వరంగంతో చేసిన

చారిత్రక విశ్లేషణ. అహింసా మార్గంలో స్వాతంత్ర్యం సాధించాలన్న గాంధీజీ పంథాను శంకించే వ్యాఖ్యను పన్నాబాబు ఆమోదించలేదు. అలాంటి వ్యాఖ్యను ఏ సహ రాజకీయపక్షం చేసినా ఎదుర్కొన్నారు. అదే సమయంలో భారత జాతీయ కాంగ్రెస్‌తోపాటు, కమ్యూనిస్టు పార్టీల కొన్ని నిర్ణయాలను విశ్లేషించారు. గాంధీజీ ప్రారంభించిన సత్యాగ్రహ విధానాలనూ, ఆయన తీసుకున్న ఆకస్మిక నిర్ణయాలతో ఉద్యమాలకు కలిగిన దుష్ఫలితాలనూ పన్నాబాబు తర్కించారు.

భారత జాతీయ కాంగ్రెస్, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ, కమ్యూనిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్ వగైరా సంస్థలన్నీ జాతీయోద్యమంలో తమ వంతు పాత్రను నిర్వహించినవే. కానీ ఇవన్నీ ఒకే మూసలో నుంచి వచ్చినవి కావు. కమ్యూనిస్టులు, సోషలిస్టులే కాదు, కొందరు వ్యక్తులు, ఇతర ఉద్యమకారులు కూడా పలు సందర్భాలలో గాంధీతో విభేదించినవారే. అదే సమయంలో గాంధీ దేశవిభజనను వ్యతిరేకించినప్పుడూ, కాంగ్రెస్ నాయకత్వం విభజనను భుజాన వేసుకున్నప్పుడూ సీఎస్‌పీ, కమ్యూనిస్టులు, సోషలిస్టులు గాంధీజీకి అండగా నిలిచారు. 'హింస' ప్రధాన ఆయుధం కాదనీ, అహింసాయుత విప్లవమే ఆదర్శమనీ కూడా నాడు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించుకోలేదు. అహింస ద్వారానే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందనీ నమ్మలేదు. కానీ అహింసా ప్రయోగాన్నీ తప్పుగా అంచనా వేసి, గాంధీని ధనికవర్గ ప్రతినిధిగా, బూర్జువా వర్గ ప్రతినిధిగా ప్రచారం చేయడాన్ని పన్నాలాల్ విమర్శించారు. అందుకే రజనీ పామీదత్ (బ్రిటిష్ కమ్యూనిస్టు నేతలలో ఒకరు), ఇ.ఎం.ఎస్ నంబూద్రిపాద్‌ల వైఖరిని, కొంతమేరకు ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ లాంటి కమ్యూనిస్టు నాయకులు గాంధీ గురించి వేసిన అంచనాలను ఖండించారు. సత్యాగ్రహోద్యమంతో, అహింసా సిద్ధాంతం ప్రాతిపదికగా నిరక్షరాస్యులైన అసంఖ్యాకులను కనీస కార్యక్రమం ఆధారంగా మాత్రమే సమీకరించగలమని గాంధీ విశ్వసించారు.

నిరక్షరాస్యులను కదిలించడానికీ, వారికి బతుకుబాట చూపగల కనీస కార్యక్రమాలవైపు ఆకర్షించేందుకూ గాంధీ వ్యూహరచన చేశారు. వాటిలో ప్రధానమైంది– '15 అంశాల'తో కూడిన తక్షణాచరణ నిర్మాణ కార్యక్రమం. అవి హిందూ–ముస్లిం ఐక్యత, హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ, ఆదివాసీల ఉద్ధరణ, మహిళోద్ధరణ, మద్యనిషేధం, ఖాదీ కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం, ప్రాథమిక మౌలిక విద్య, ప్రజారోగ్యం, హిందీ తదితర ప్రాంతీయ భాషల అభివృద్ధి, కార్మికోద్ధరణ, వయోజన విద్య, విద్యార్థి సంఘాల నిర్మాణం, స్వదేశీ వస్తువుల ప్రోత్సాహం వగైరా కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడం. అయితే కొన్ని మార్క్సు విప్లవ సిద్ధాంతాలకూ, గాంధీ సిద్ధాంతానికి మౌలిక సూత్రీకరణల్లో పెద్ద తేడా కనిపించదని పన్నాలాల్ భావన. పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో శ్రమజీవులు పరాయీకరణకు లోనవుతారని మార్క్సు–గాంధీలు ఏకీభవిస్తారు. దోపిడీని నిరసిస్తారు. దాని నిర్మూలనకు అనుసరించాల్సిన మార్గాలలోనే ఉభయుల సిద్ధాంతాలు విభేదిస్తాయి. అంతమాత్రాన నాయకత్వ స్థాయిలో ఉన్న త్యాగ పురుషులకు ఉద్దేశాలు అంటకట్టకూడదన్నదే పన్నాలాల్ ఉద్దేశం. అందుకే 'పోరాటాల ద్వారా తప్ప ప్రజా బాహుళ్యాన్ని ఉద్యమింపజేయలేమన్న వామపక్షాల నమ్మకం ఒక భ్రమ' అని పన్నాలాల్ విశ్వసించారు. కానీ రాజకీయ సంస్థలకు, వ్యవస్థలకు దేశ, సమాజ ఆర్థిక పరిస్థితులే మూలమన్న సత్యాన్ని మనం మరవరాదు. కమ్యూనిస్టులదే కాదు, ఉద్యమ గమనంలో గాంధీజీని అనుసరించి నెహ్రూతో పాటు, కాంగ్రెస్‌లోనే జిన్నా, సుభాష్ చంద్రబోస్‌ల స్వాతంత్ర్య సాధన గమ్యం వేరైంది.

**మరో పోరాటం అవసరం ఉంది**

పన్నాలాల్ గుర్తించినట్టు స్వాతంత్ర్యోద్యమంలో వామపక్షాలు సహనం కోల్పోతూ వచ్చాయి. సుభాష్ బోస్ పరిస్థితీ అంతే. బ్రిటిష్ సామ్రాజ్యవాదులను వ్యతిరేకిస్తున్న శక్తుల నుంచి సహాయం పొంది దేశాన్ని విముక్తి చేయాలన్న నిర్ణయానికి వచ్చాడు సుభాష్. ఆ ఊపులో బోస్ చేసిన ఘోరతప్పిదం– ఫాసిస్టు జర్మనీ, జపనీస్‌లను కలిసి సహాయం కోరడం (1940–42). రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్‌ను ఎదుర్కొనేందుకు అగ్రరాజ్య మిత్రమండలిలో అమెరికా, బ్రిటన్, సోషలిస్టు సోవియెట్ యూనియన్‌లు భాగస్వాములైన తరువాత భారతదేశ స్వాతంత్ర్య సమరంలో భాగస్వామి అయిన కమ్యూనిస్టు పార్టీ ఆకస్మికంగా ఈ ప్రపంచ యుద్ధ స్వభావాన్ని (సోవియెట్ రష్యా పాల్గనడంతో) 'ప్రజాయుద్ధం'గా ప్రకటించింది. అప్పటిదాకా స్వాతంత్ర్యం కోసం అజ్ఞాతవాసంలో పోరాటాన్ని సాగిస్తున్న కమ్యూనిస్టు పార్టీపై తమ స్వార్థం కోసం బ్రిటిష్ పాలకులు నిషేధాజ్ఞలు సడలించారు. ఆ సమయంలోనే 'ప్రజాయుద్ధం' (పీపుల్స్‌వార్) నినాదాన్ని చేపట్టిన కమ్యూనిస్టులను స్వాతంత్ర్య పోరాటానికి శత్రువులుగా చిత్రిస్తూ జాతీయ కాంగ్రెస్ గాంధీజీ చెవులు కొరికింది. కమ్యూనిస్టు నాయకులపైన విష ప్రచారానికి సిద్ధమైంది. అప్పుడు గాంధీజీ 'ఇది నిజమేనా?' అంటూ ఆనాటి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న పి.సి జోషీకి లేఖ రాశారు. జోషీ అంశాలవారీగా వివరణ ఇస్తూ సుదీర్ఘ లేఖ రాశారు. గాంధీజీ కృతజ్ఞత తెలుపుతూ ప్రత్యుత్తరం కూడా రాశారు. నిర్మలమైన మనస్సున్నవాడు కాబట్టి గాంధీజీ

ఉద్యమనిర్వహణలో తన తప్పిదాలకు పలుమార్లు క్షమాపణ చెప్పారు.

అన్నింటికన్నా పెద్ద ఒప్పుకోలు– 'కాంగ్రెస్ హిమాలయ పర్వతమంత తప్పులు చేసిందన్న' ప్రకటన. బహుశా అందుకే పన్నాలాల్ కూడా స్టాలిన్ మాటలను ఉదహరించాల్సి వచ్చింది: 'ఒక చారిత్రక పరిస్థితికి ఫలానా పంథా సరైన మార్గమనుకున్నది మరొక చారిత్రక సందర్భానికి తగిన మార్గం కాకపోవచ్చు.' బహుశా ఈ దృక్పథం నుంచే భారతీయ ప్రొఫెసర్ శ్రీమతి అనన్య వాజ్‌పేయి (కేంబ్రిడ్జి యూనివర్సిటీ: 2.10.2017) నేటి గాంధీ భారతానికి జోడించిన వ్యాఖ్య వర్తిస్తుందేమో చూడండి: 'ఇండియా వలస పాలనా గుదిబండను వదిలించుకుంది. కానీ, స్వాతంత్ర్యం తర్వాత, గాంధీజీ హత్యానంతరం మరొకసారి 70 ఏళ్ల తర్వాత స్వేచ్ఛా భారతం కోసం మరొక పోరాటాన్ని చేయకతప్పదనిపిస్తోంది!'

*(సాక్షి సౌజన్యంతో)* ❑

# పౌరసేవల చట్టం తేవాలి



ప్రభుత్వోద్యోగులు ప్రజలకు అందించాల్సిన సేవలు నిర్ణీత వ్యవధిలో జరిగేలా, ఆలస్యమైతే ప్రతిరోజూ దరఖాస్తుదారునికి జరిమానా చెల్లించేలా 'పౌర సేవల' (రైట్ టూ సర్వీసెస్) చట్టాన్ని తీసుకురావాలని పలు పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ చట్టం వస్తే అవినీతి తగ్గడంతోపాటు నాయకులు, ఉన్నతాధికారుల సిఫారసులు అవసరం లేకుండానే ప్రజలకు పనులు జరిగిపోతాయన్నారు. హక్కుగా 'పౌర సేవల' చట్టంపై హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అధ్యక్షత వహించారు. కాంగ్రెస్ రైతు విభాగం నాయకుడు కోదండరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, చట్టాల్ని సకాలంలో తేవటం, సరిగా అమలు చేయటం ముఖ్యమని, పౌరసేవల చట్టాన్ని వెంటనే తేవాల్సిన అవసరముందని అన్నారు. లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇప్పటికే ఈ చట్టం నమూనాను తెలంగాణ ప్రభుత్వానికి పంపారని, ఈ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతునిస్తోందని అన్నారు. పాలనలో ఎక్కడా పారదర్శకత లేకుండా పోయిందని, కొత్త ఎత్తుగడలతో లంచాల్ని గుంజుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధికార ప్రతినిధి దాసరి ప్రకాష్ అన్నారు. పౌర సేవల చట్టం తేవడమే దీనికి విరుగుడు అన్నారు. పాండురంగారావు మాట్లాడుతూ, 2016లో తాము బిల్లును పంపితే ఇప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం స్పందించకపోవటం విచారకరమని, ప్రజలకు రోజువారీ సేవలు సక్రమంగా అందించకుండా గొప్ప పాలన చేస్తున్నామనటం విడ్డూరమన్నారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందిస్తామని, ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక మంత్రి కేటీఆర్‌ను కలిసి అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. తెలంగాణ లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు మన్నారం నాగరాజు, ప్రధాన కార్యదర్శి రేఖ, లోక్‌సత్తా రాష్ట్ర నేతలు ఎస్.దుర్గారావు, ఎన్. సరోజాదేవి, పల్లేటి రమేష్, అధికార ప్రతినిధి కొంగర గంగాధరరావు, నార్ల ఆనంద్, ఎ.నారాయణరావు, రామ్మోహన్, వెంకటేష్, మహేశ్వరుడు, యువసత్తా అధ్యక్షుడు శివరామకృష్ణ, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ❑

# పౌరసేవల బిల్లును పార్లమెంటు ముందుంచిన అరుణాచల్ ఎంపీ

పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి మేరకు లోక్‌సత్తా జేపీ రూపొందించిన రైట్ టూ సర్వీసెస్ బిల్లు పార్లమెంటు వద్దే ఆమోదానికి ఎదురుచూస్తోంది. తాజాగా అరుణాచల్ తూర్పు నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న నినాంగ్ ఎరింగ్ కూడా ఇలాంటి బిల్లును పార్లమెంటు ముందుకు తెచ్చారు. రైట్ టూ పబ్లిక్ సర్వీసెస్ బిల్లును తేవటం ఇండియాకు చాలా అవసరమని వాదిస్తూ సభ్యుల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. పౌరసేవల చట్టం వల్ల ప్రజల రోజువారీ జీవితాల్లో అవినీతి బాగా తగ్గుతుందని, వారికి ప్రభుత్వాలు, ప్రజాస్వామ్యం మీద విశ్వాసం పెరుగుతుందని ఆయనంటున్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాల్ని లంచాలు లేకుండా గౌరవప్రదంగా అందించటం ప్రభుత్వాల బాధ్యతన్నారు. ❑

# వృద్ధి ఉత్సాహానికి, విధాన లోపాలకి అద్దం పట్టిన తెలంగాణ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం-2018



**కొత్త జిల్లాలవారీగా తలసరి ఆదాయం(రూ.ల్లో)**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | ఆసిఫాబాద్ | మంచిర్యాల | నిర్మల్ | నిజామాబాద్ | జగిత్యాల | పెద్దపల్లి | భూపాలపల్లి |
| 93,588 | 1,03,822 | 1,04,891 | 98,129 | 1,04,868 | 91,885 | 1,29,723 | 1,15,774 |
| కొత్తగూడెం | మహబూబాబాద్ | వరంగల్ రూరల్ | వరంగల్ అర్బన్ | కరీంనగర్ | సిరిసిల్ల | కామారెడ్డి | సంగారెడ్డి |
| 1,26,084 | 1,07,684 | 1,03,914 | 91,333 | 1,20,173 | 99,687 | 86,608 | 1,64,698 |
| మెదక్ | సిద్దిపేట | జనగామ | యాదాద్రి | మేడ్చల్ | హైదరాబాద్ | రంగారెడ్డి | |
| 1,10,345 | 1,28,701 | 1,00,216 | 1,31,749 | 1,81,104 | 3,15,745 | 3,68,747 | |
| వికారాబాద్ | మహబూబ్‌నగర్ | జోగులాంబ | నాగర్‌కర్నూలు | నల్లగొండ | సూర్యాపేట | ఖమ్మం | వనపర్తి |
| 87,891 | 86,237 | 1,01,977 | 82,694 | 1,04,660 | 1,13,348 | 1,08,133 | 94,774 |

ఆర్థికవృద్ధి రేటు నుంచి తలసరి ఆదాయం వరకు జాతీయవృద్ధిలో తెలంగాణ భాగస్వామ్యం మరింత బలపడుతున్నట్టు శాసనసభలో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక ముఖచిత్రం-2018 (సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్) సంకేతాలనిచ్చింది.

2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ధరలలో చూసుకుంటే తెలంగాణ వృద్ధి రేటు 14.1 శాతంగా ఉంది. రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.7.33 లక్షల కోట్లుగా నమోదైంది. 2016-17లో జీఎస్‌డీపీ రూ.6.42 లక్షల కోట్లు. తెలంగాణ ఆవిర్భవించిన సంవత్సరంలో (2014-15) 12శాతం వృద్ధి రేటు నమోదైంది.

2011-12లో రాష్ట్ర దేశీయ ఉత్పత్తి రూ.3,59,434 కోట్లు కాగా, జాతీయ స్థూల ఉత్పత్తి రూ.87,36,329 కోట్లు. జీడీపీలో తెలంగాణ వాటా 4.11 శాతం వరకు ఉంది. 2014-15 ఆర్థిక సంవత్సరానికి వచ్చేసరికి తెలంగాణ జీఎస్‌డీపీ రూ.5,05,849 కోట్లు.. జాతీయ స్థూల ఉత్పత్తి రూ.1,24,67,959 కోట్లు. జీడీపీలో రాష్ట్ర వాటా 4.06 శాతంగా నమోదైంది. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక అభివృద్ధిలో ఏమాత్రం తగ్గదల నమోదు కాలేదు. 2017-18లో జీడీపీలో తెలంగాణ రాష్ట్ర వాటా 4.37 శాతం.

ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందు (2012 నుంచి 2014 వరకు) ఏటా 4.2 శాతం వృద్ధి రేటు నమోదవ్వగా, 2014-15 నుంచి 2017-18 మధ్య ఏటా సగటున 9.0శాతం నమోదైంది. ఇది జాతీయ వృద్ధి రేటు (7.3శాతం) కంటే ఎక్కువగా ఉంది.

### పెరుగుతున్న విద్యుదుత్పాక సామర్థ్యం

రాష్ట్రం ఏర్పడిన కొత్తలో 2,700 మెగావాట్ల లోటు ఉండగా.. క్రమంగా ఆ రంగం ముఖచిత్రమే మారిపోయింది. మూడున్నరేళ్లలో ప్రభుత్వ, అంతర్రాష్ట్ర, సంయుక్త, ప్రైవేటు, కేంద్ర రంగం కలుపుకుని రాష్ట్ర ఉత్పాదక సామర్థ్యం 14,913 మెగావాట్లకు చేరుకుంది. రానున్న మూడేళ్లలో ఇది 28వేల మెగావాట్లకు చేరనుంది. గతంలో 1,33,89,134 విద్యుత్ కనెక్షన్లు ఉండగా, ఇప్పుడు 3,33,697 పెరిగాయి.

### 12,294 ఎంఎస్‌ఎంఈలు

రాష్ట్రంలో గత రెండేళ్లలో 9,554 కోట్ల పెట్టుబడితో 12,294 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను స్థాపించినట్టు సామాజిక, ఆర్థిక ముఖచిత్రం వెల్లడించింది. వీటితో 1.26 లక్షలమందికి ఉపాధి లభిస్తోంది. అత్యధికంగా రంగారెడ్డిలో 3,488 పరిశ్రమలు ఏర్పడ్డాయి. 2015-16 ఆర్థిక సంవత్సరంలో 35,444 కోట్ల విలువైన ఫార్మా, ఆర్గానిక్ కెమికల్స్, ఎలక్ట్రికల్ యంత్రాలు, పరికరాలు, స్టాన్, ప్లాస్టర్, సిమెంట్, తదితర పారిశ్రామిక ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేశారు. 2017-18లో ఇవి రూ.40,322 కోట్లకు పెరిగాయి. టీఎస్-ఐపాస్ విధానంలో జనవరి 2018 నెలాఖరునాటికి రూ.1,18,041 కోట్ల పెట్టుబడితో 6,117 పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. వీటితో 4,42,962 మందికి ఉపాధి లభిస్తుంది. 517 పరిశ్రమలు రూ.29,324 కోట్లతో ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఉత్పత్తులు ప్రారంభించేందుకు 1,21,132 మంది కార్మికులు అవసరం.

### జాతీయ తలసరి ఆదాయం కంటే మిన్న

తలసరి ఆదాయం విషయానికొస్తే.. తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ

### తగ్గని బాల్యవివాహాలు.. లైంగిక వేధింపులు

తెలంగాణలో బాల్యవివాహాలు పెరుగుతూనే ఉన్నాయి. పసిమొగ్గలపై లైంగిక వేధింపులు, వికృత చేష్టలు ఎక్కువయ్యాయి. 2017-18లో ఫిర్యాదులు అందగా అధికారులే స్వయంగా 316 బాల్యవివాహాలను నిరోధించినట్టు రాష్ట్ర ప్రభుత్వం 'సామాజిక ఆర్థిక ముఖచిత్రం'లో పేర్కొంది. పనిచేసే చోట, బహిరంగ ప్రదేశాల్లో లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయి. చిన్నపిల్లలు, బాలికలు, బాలురపై లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటనలపై పోస్కో చట్టం కింద 544 కేసులు నమోదయ్యాయి. మహిళలపై వేధింపుల సంఘటనలకు సంబంధించి సఖి కేంద్రాలకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. లైంగిక వేధింపులపై 782 కేసులు, గృహహింసపై 5,995 కేసులకు సంబంధించి సదరు కేంద్రాల ద్వారా చర్యలు తీసుకున్నట్టు నివేదిక వెల్లడించింది.

### ఆధార్ అనుసంధానంతో రూ.500 కోట్లకుపైగా లాభం

- ప్రజాపంపిణీ వ్యవస్థ కింద ఆధార్‌తో లబ్ధిదారుల అనుసంధానం 99.28 శాతం పూర్తయింది. మొత్తం 17,168 రేషన్ దుకాణాల్లో 14,005 దుకాణాలకు పీవోఎస్ యంత్రాలు అందుబాటులో ఉంచారు. దీనితో రూ. 521.93 కోట్లు ప్రభుత్వానికి ఆదా అయ్యాయి.
- ఉపాధి హామీ కింద 51.11 లక్షల జాబ్‌కార్డులు జారీ చేశారు. ఇందులో 31 లక్షలు మాత్రమే చెల్లుబాటులో ఉన్నాయి. 41.8 లక్షల మంది ఉపాధి పనులు చేసేందుకు ముందుకొచ్చారు.
- ఆసరా పింఛన్లలో రాష్ట్రవ్యాప్తంగా 38.87 లక్షల లబ్ధిదారులుంటే.. 13.98 లక్షల మంది వితంతువులే. వృద్ధాప్య పింఛన్లు పొందుతున్న వారు 13.38 లక్షల మంది ఉన్నారు. వితంతు లబ్ధిదారులు హైదరాబాద్‌లో అత్యధికంగా 89 వేల మంది ఉండగా, రంగారెడ్డిలో 75 వేలు, నల్గండలో 74 వేలు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.
- ఖనిజ సంపదలో బొగ్గు ఉత్పత్తి అత్యధికంగా ఉంది. తెలంగాణలో 6.08 కోట్ల టన్నుల బొగ్గును తవ్వితీశారు. ఈ సంపద విలువ దాదాపు రూ.8914 కోట్లు ఉంటుందని అంచనా. తవ్వితీసిన ఖనిజం విలువ ఆధారంగా రంగుల గ్రానైట్, బ్లాక్ గ్రానైట్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

తలసరి కంటే ఎక్కువగా ఉంది. సొంత రాష్ట్రం ఏర్పడిన తర్వాత తలసరి ఆదాయం గణనీయంగా పెరుగుతూనే ఉంది. 2011-12లో రూ.91,121గా ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం.. 2017-18లో రూ.1,75,534కు చేరింది. అంటే 2011-12 కంటే 93శాతం పెరిగింది. జాతీయ తలసరి ఆదాయం 2011-12లో రూ.63,462కాగా.. 2017-18లో రూ.1,12,764గా నమోదైంది.

జిల్లాల వారీగా తలసరి ఆదాయం అంతరాలు ఎక్కువగా ఉన్నాయి. 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రంగారెడ్డి జిల్లా రూ.3,68,747 తలసరి ఆదాయంతో తొలిస్థానంలో ఉండగా, రూ.3,15,745తో రెండోస్థానంలో హైదరాబాద్, రూ.1,81,104తో మూడోస్థానంలో మేడ్చల్ జిల్లా ఉన్నాయి. అతితక్కువ తలసరి ఆదాయం రూ.82,694తో నాగర్‌కర్నూల్ జిల్లా చివరిస్థానంలో ఉంది.

### తగ్గుతున్న ఆహార పంటల సాగు విస్తీర్ణం

రాష్ట్రంలో ఆహార పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతున్నట్టు సర్వే వెల్లడించింది. దశాబ్దంన్నర (2001-16) కాలంలో సాగు విస్తీర్ణం 70 శాతం నుంచి 53.50శాతానికి పడిపోయింది. 2016-17లో కాస్త పెరిగినా 2017-18 ఆర్థిక సంవత్సరంలో 7.33శాతం తగ్గింది.

- ఆహార పంటల సాగు విస్తీర్ణంతోపాటు దిగుమతులూ పడిపోతున్నాయి. గతేడాది (2016-17)లో కోటీ లక్షా 29వేల టన్నుల ఆహారధాన్యాల దిగుబడులొస్తే ఈ ఏడాది 95 లక్షల టన్నులకు తగ్గాయి. నూనెగింజల పంటల ఉత్పత్తులు సైతం 7.22 లక్షల టన్నుల నుంచి 5.77 లక్షల టన్నులకు తగ్గాయి.
- ఆహారేతర పంటల్లో పత్తి సాగు గణనీయంగా పెరుగుతోంది. గతేడాది కన్నా ఏకంగా 35.06 శాతం ఈ ఏడాది పెరగడం గమనార్హం. దిగుబడిలో వృద్ధి మాత్రం 25.78 శాతమే నమోదైంది.
- వరి, పత్తి, మొక్కజొన్నలే 70 శాతం విస్తీర్ణంలో రైతులు వేస్తున్నారు.
- మొత్తం ఆహార పంటల్లో కూరగాయల సాగు విస్తీర్ణం ఖరీఫ్‌లో 2.5 శాతం, పండ్ల తోటలు 6 శాతమే ఉంటున్నాయి.
- రాష్ట్రంలో సగటు కమతం విస్తీర్ణం 2005-06లో 1.3 హెక్టార్లుంటే 2011 నాటికి 1.1 హెక్టార్లకు తగ్గింది. మొత్తం కమతాల్లో 80 శాతం చిన్న, సన్నకారు రైతుల చేతుల్లోనే ఉన్నాయి.
- 1970-71లో తెలంగాణ ప్రాంతంలో సగటు కమతం పరిమాణం 3.09 హెక్టార్లుంటే జాతీయస్థాయి సగటు 2.28 హెక్టార్లు.

**నూనెగింజల సాగు లేక..**
**విదేశాల నుంచి వంటనూనెల్ని దిగుమతి చేసుకుంటున్నారు**

పంట రుణాల పంపిణీలో బ్యాంకుల తీరు వల్ల కేంద్రం చెబుతున్న పంట మార్పిడి విధానం సాధ్యపడటం లేదని సర్వే చెబుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం పంటరుణాల్లో 67 శాతం (రూ.25,812 కోట్లు) వరి, పత్తి, మక్క పంటలకే ఇవ్వాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) వార్షిక రుణప్రణాళికలో నిర్ణయించినట్టు సర్వే తెలిపింది. దిగుబడులు పెరగాలంటే ఒక ఏడాది ఒక పంట వేసిన పొలంలో మరుసటి ఏడాది అదే పైరును సాగుచేయకుండా మరొకటి వేసేలా రైతులను చైతన్య పరచాలని కేంద్ర వ్యవసాయశాఖ రాష్ట్రాలను కోరుతోంది. వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు సైతం ఇదే సూచిస్తున్నారు. ఇది జరగాలంటే కొత్త పంటలకు బ్యాంకుల రుణసాయం పెరగాలి. వాస్తవంగా అది జరగడం లేదు. 2017-18లో వానాకాలం, యాసంగి సీజన్లలో మొత్తం రూ.38,298 కోట్ల రుణాలను వ్యవసాయ రంగానికి ఇవ్వాలని ఎస్‌ఎల్‌బీసీ నిర్ణయించింది. వరి సాగు చేసే 19.18 లక్షల మంది రైతులకు రూ.16,690 కోట్లు, పత్తికి 7.48 లక్షల మందికి రూ.6,810 కోట్లు, మక్క వేసే 5.50 లక్షల మందికి 2,312 కోట్లు ఇవ్వనున్నట్టు చెప్పింది. ఈ మూడూ కాక మిరప, వేరుసెనగ, జన్నలకు మాత్రమే రూ.వెయ్యి కోట్లకుపైగా పంట రుణాలను కేటాయించారు. రాష్ట్రంలో 7 లక్షలకు పైగా ఎకరాల్లో సాగవుతున్న సోయాచిక్కుడుకు రూ.378 కోట్లు ఇచ్చారు. నూనెగింజల పంటల సాగులేక విదేశాల నుంచి వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్నారు (దీనివల్ల రైతులకు, వినియోగదారులకు తీవ్ర నష్టం వస్తోందని లోక్‌సత్తా పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. నూనెల దిగుమతులపై సుంకాలు విధించి ఆ డబ్బును రైతులకే ఇచ్చి నూనెగింజల ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరుతోంది). తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువగా పొద్దుతిరుగుడు నూనె వాడుతుంటారు. ఈ పంట సాగుకు రూ.174 కోట్లు మాత్రమే కేటాయించారు. అవి కూడా సరిగా ఇవ్వడం లేదు. అన్ని రకాల పంటలకు కలిపి మొత్తం 49.38 లక్షల మంది రైతులకు పంట రుణాలిస్తారని, అందులో 32.17 లక్షల మంది రైతులు వరి, పత్తి, మక్క వేస్తారని వారికే రూ.25,812 కోట్లు ఇస్తున్నారని తెలిపింది.

2010-11 నాటికి తెలంగాణ కమతం పరిమాణం 1.12 హెక్టార్లకు తగ్గగా, జాతీయ సగటు 1.15 శాతముంది. తెలంగాణలో కమతాల పరిమాణం వేగంగా తగ్గుతోంది.

- ఉత్తర తెలంగాణ వాతావరణంలో వరి, మక్క సోయా, పత్తి, కంది, పసుపు పంటలు అధికంగా పండుతున్నాయి. మధ్య తెలంగాణలో పత్తి, వరి, మక్క పెసర, మామిడి, మిరప సాగు బాగా ఉంది. దక్షిణ తెలంగాణలో ఉత్తర తెలంగాణ ప్రాంత పంటలే సాగవుతున్నాయి.
- ఈ ఏడాది మొత్తం 49.38 లక్షల మంది రైతులకు రూ.39,298 కోట్ల రుణాలివ్వాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో వరి, పత్తి పంటలకే 60 శాతం ఇవ్వాలని అంచనా. మొత్తం సొమ్ములో అత్యధికంగా నిజామాబాద్‌కు 6.7 శాతం (రూ.3,610 కోట్లు), అత్యల్పంగా మేడ్చల్‌కు 0.8 శాతం (రూ.453 కోట్లు) ఇవ్వాలన్నది లక్ష్యం.
- పాల ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో 13వ స్థానంలో, మాంసం ఉత్పత్తిలో 5, కోడిగుడ్లలో 3వ స్థానంలో ఉంది. గతేడాది 5.91 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తి అయింది.
- 2011 జనాభా లెక్కల ప్రకారం రైతులు 31.51 లక్షల మంది ఉంటే, రైతు కూలీలు 59.15 లక్షలమంది ఉన్నారు. ఒక్క హైదరాబాద్ జిల్లాలో మాత్రమే రైతు కూలీలకన్నా రైతులు ఎక్కువగా ఉన్నారు.

**మరికొన్ని..**

- ఐటీ ఎగుమతుల్లో నిరుడు జాతీయ సగటు వృద్ధి 10 శాతం ఉంటే, తెలంగాణలో 13.85 శాతం నమోదైంది.
- రాష్ట్రంలో 1,10,012 ఉద్యోగ ఖాళీలను ప్రభుత్వం గుర్తించింది. ఇందులో 83,048 ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే ఉత్తర్వులను జారీ చేశారు. 27,588 ఉద్యోగాలను భర్తీ చేశారు.
- కొత్తగా సూర్యాపేట, నల్లగొండల్లో వైద్య కళాశాలలను ఏర్పాటు చేయబోతున్నారు.
- గోదావరి, కృష్ణా నదులపై 23 మేజర్, 13 మీడియం ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టింది.
- హరితహారంలో భాగంగా 2017-18లో రాష్ట్రంలో 40 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని 34.07 కోట్ల మొక్కలు నాటినట్లు సామాజిక ఆర్థిక ముఖచిత్రం వెల్లడించింది. అందులో 30.81 కోట్ల మొక్కలను జియో ట్యాగింగ్ చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లలో 230 కోట్ల మొక్కలు నాటాలన్న లక్ష్యం పెట్టుకున్న ప్రభుత్వం మూడేళ్లలో 82 కోట్ల మొక్కలు నాటింది. మొక్కల సంరక్షణకు అటవీశాఖ 4,81,948 మంది హరిత సైనికులను నియమించింది. ❑

# తెలంగాణ బడ్జెట్ 2018-19



**వ్య**వసాయం, అనుబంధ రంగాలు, వాటికి తోడుగా నిలిచే సాగునీరు, విద్యుత్ రంగాలకు 26 శాతం నిధుల ప్రోత్సాహంతో 2018-19 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ పద్దులను ఆవిష్కరించింది. ప్రజలకు సెక్షన్లవారీగా చేసిన సంక్షేమ కేటాయింపులకూ పెద్ద పీట వేసింది.

ఎన్నికల కదనోత్సాహంతో కొన్నిచోట్ల అంకెల గారడీలతో రూ. 1,74,453 కోట్లతో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2018 బడ్జెట్‌లో, గతేడాది బడ్జెట్ అంచనాలకంటే 16.9శాతం పెరుగుదల ఉంది. రాష్ట్ర ఆర్థిక

**బడ్జెట్ సమగ్ర స్వరూపం**

**2018-19 తెలంగాణ బడ్జెట్ అంచనాలు**

| వివరం | రూ. కోట్లలో |
|---|---|
| **1. ప్రారంభ నిల్వ** | 311.90 |
| **2. రెవెన్యూ వసూళ్లు** | 1,30,975.10 |
| ఎ) కేంద్ర పన్నుల్లో వాటా | 19,207.43 |
| బి) పన్ను ఆదాయం | 73,751.88 |
| సి) పన్నేతర ఆదాయం | 8,973.92 |
| డి) గ్రాంట్లు | 29,041.87 |
| **3. మూలధన వసూళ్లు** | 43,507.17 |
| ఎ) బహిరంగ మార్కెట్ రుణాలు | 31,500.00 |
| బి) స్వల్పకాలిక రుణాలు | 100.00 |
| సి) కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు | 800.00 |
| డి) ఇతర రుణాలు | 800.00 |
| ఇ) డిపాజిట్లు, లావాదేవీలు (నికరం) | 2,500.00 |
| ఎఫ్) రుణాలు, అడ్వాన్స్‌లు | 7,807.17 |
| జి) ఇతర వసూళ్లు | |
| హెచ్) కంటిజెన్సీ నిధి | |
| **4. మొత్తం వసూళ్లు** | 1,74,482.28 |
| **5. మొత్తం వ్యయం** | 1,74,453.83 |
| ఎ) రెవెన్యూ వ్యయం | 1,25,454.70 |
| బి) ఇందులో వడ్డీ చెల్లింపులు | 11,691.11 |
| సి) మూలధన వ్యయం | 33,369.10 |
| డి) రుణాలు, అడ్వాన్స్‌లు | 9,035.55 |
| ఇ) ప్రభుత్వ రుణ చెల్లింపులు | 6,594.48 |
| **6. రెవెన్యూ మిగులు (2-ఎం)** | 5,520.40 |
| **7. ద్రవ్యలోటు** | -29,077.07 |

**ఏటా 10వేల కోట్ల మేర పెరుగుతున్న పన్నుల భారం**

తెలంగాణలో పన్నుల భారం ఏటా రూ.10,000 కోట్ల మేర పెరుగుతోంది. 2017-18లో మొత్తం పన్నులు రూ.62,618 కోట్లు ఉండగా, 2018-19లో రూ.73,751 కోట్లకు పెరిగాయి.

**పన్నుల భారం ఇలా** (రూ. కోట్లలో)

| పన్ను | 2017-18 | 2018-19 |
|---|---|---|
| భూమి శిస్తు | 14 | 4.6 |
| రిజిస్ట్రేషన్లు | 3,000 | 4,699 |
| స్థిరాస్తులపై పన్నులు | 137 | 129 |
| మద్యంపై ఎక్సైజ్ | 8,999 | 10,600 |
| అమ్మకం, వాణిజ్యం | 46,499 | 25,942 |
| వాహనాలపై పన్ను | 3,000 | 3,950 |
| విద్యుత్ డ్యూటీ | 169 | 434 |
| ఇతర పన్నులు | 800 | 27,992 |
| మొత్తం పన్నులు | 62,618 | 73,751 |

**కేంద్ర ప్రభుత్వంపై ఆశలు**

ఈసారి కూడా కేంద్రం మీద ఆశలతో భారీ అంచనాలను బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వేసింది. గత నాలుగేళ్ల అనుభవాలను విస్మరించి కేంద్రం నుంచి వచ్చే నిధులను భూతద్దంలో చూపారన్న విమర్శలు వినవస్తున్నాయి. ఫిబ్రవరిలోనే కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. పన్నుల వాటాతో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాలు, గ్రాంట్ల రూపంలో దాదాపు రూ.30 వేల కోట్లు తెలంగాణకు వచ్చే అవకాశమున్నట్టు కేంద్ర బడ్జెట్ వెల్లడించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా కేంద్రం నుంచి రూ.48 వేల కోట్లు వస్తాయనే అంచనాలతో బడ్జెట్‌ను తయారుచేసింది. పక్కాగా వచ్చే నిధులకు అదనంగా.. ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.900 కోట్లు, ఇతర గ్రాంట్ల కింద రూ.15,698 కోట్లు వస్తాయని అంచనాలు వేసుకుంది.

పరిస్థితి పటిష్టంగా ఉందని, మెరుగైన వృద్ధి రేటుతో ముందుకు సాగుతున్నామని ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర బడ్జెట్‌లో 60 శాతం నిధులను ప్రగతి పద్దు కింద కేటాయింపులు చేశారు. బడ్జెట్‌లో రూ.1.04 లక్షల కోట్లను ప్రగతి పద్దు కిందే చూపారు. రాష్ట్ర సొంత రాబడులు 22.84 శాతం మేర పెరిగినట్లు ప్రభుత్వం ప్రకటించింది. నోట్ల రద్దు, జీఎస్టీ నేపథ్యం వంటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా రాష్ట్ర రాబడులు పెరిగాయి. జీఎస్టీ అమలు తొలిదశలో రాష్ట్ర రాబడి తగ్గినా చివరి నెలల్లో పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే గ్రాంటులను రూ.29వేల కోట్లుగా అంచనా వేసింది. రాష్ట్ర సొంత రాబడులు రూ.73,751 కోట్లు, కేంద్ర పన్నుల వాటా రూ.19,207 కోట్లుగా పేర్కొంది. ఎక్సయిజ్,

**భూముల అమ్మకం ద్వారా 3,000 కోట్లు**

భూముల అమ్మకం ద్వారా రూ.3,000 కోట్లు సమకూర్చుకోవాలనుకుంటున్నట్టు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. గత బడ్జెట్‌లో భూముల అమ్మకానికి సంబంధించి ఎలాంటి ప్రతిపాదనా లేదు. 2016-17లో మాత్రం భూముల అమ్మకం ద్వారా రూ.1,776 కోట్లను ప్రభుత్వం సమకూర్చుకుంది. నాలుగేళ్లలో జీఎస్‌డీపీలో అప్పుల శాతం నాలుగుకు పైగా పెరిగింది. తాజాగా జీఎస్‌డీపీలో అప్పుల శాతం 21.39కి చేరుకుంది.

స్టాంపులు రిజిస్ట్రేషన్ల రాబడి అంచనాలు గతంలో కంటే పెరిగాయి. ద్రవ్యలోటు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 3.45 శాతంగా ప్రభుత్వం పేర్కొంది. మొత్తం గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,386 కోట్ల రెవెన్యూ మిగులును చూపిన ప్రభుత్వం తాజాగా రూ.5,520 కోట్ల రెవెన్యూ మిగులును అంచనా వేసింది. ద్రవ్యలోటు రూ.29,077 కోట్లుగా పేర్కొంది.

- బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంక్షేమానికి రూ.30,488 కోట్లు కేటాయించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లకు అధిక ప్రాధాన్యతనిస్తూ రూ.1,450 కోట్లు ప్రతిపాదించారు. దళితులకు మూడెకరాల భూమికి రూ.1,469 కోట్లు, అత్యంత వెనుకబడిన వర్గాలకు రూ.1000 కోట్లను కేటాయించారు.
- ఏటా రెండు పంటలు పండించే రైతులకు ఎకరాకు ఎనిమిది వేల రూపాయల చొప్పున పెట్టుబడి ప్రోత్సాహాన్ని అందించడానికి వీలుగా బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయింపులు చేసింది. గత బడ్జెట్ కంటే వ్యవసాయ రంగానికి ఒకటిన్నర రెట్లు పెంచుతూ రూ.12,601 కోట్లు కేటాయించింది.
- సాగునీటి రంగానికి బడ్జెట్ వెలుపలి నిధులతో సంబంధం లేకుండా బడ్జెట్‌లో రూ.25వేల

### తలపై రూ.51,145 అప్పు

రాష్ట్ర ప్రభుత్వ అప్పులు పెరిగిపోతున్నాయ్! తాజాగా తెలంగాణ ప్రభుత్వ అప్పు రెండు లక్షల కోట్లకు చేరువైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గణిస్తే, రాష్ట్రంలో ఒక్కో తలపై రుణభారం రూ. 51,145. ఇవికాక వివిధ ప్రభుత్వ విభాగాలకు సర్కారు రూ. 38,755 కోట్లు పూచీకత్తుగా ఉంది. బడ్జెటేతర రుణాల కింద మరిన్ని అప్పులు తీసుకున్నట్టు ప్రభుత్వం తెలిపింది. 2018 జనవరి 1 నాటికి సాగునీటి పారుదల రంగానికి రూ. 16,413.28 కోట్లు, మిషన్ భగీరథకు రూ. 7,031.89 కోట్లు, ఇతర అవసరాలకు రూ. 18,094.02 కోట్ల రుణాలను తీసుకున్నట్టు వెల్లడించింది.

### బీసీలకు పెంచింది రూ.850 కోట్లే

రాష్ట్రంలో 52 శాతంగా ఉన్న బీసీలకు గత బడ్జెట్‌లో రూ. 5,070 కోట్లు ఇవ్వగా ఈసారి రూ. 5,919 కోట్లు ప్రకటించారు. మహిళా శిశుసంక్షేమానికి కూడా రూ. 60 కోట్లు పెంచి రూ. 1890 కోట్లు ఇచ్చారు.

### పోలీస్‌కు నిధుల బందోబస్తు

శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ప్రగతి పద్దు కింద రూ. 1389 కోట్లు, నిర్వహణ పద్దు కింద రూ. 4,400.68 కోట్లు కేటాయించింది. ప్రగతి పద్దు కింద హైదరాబాద్ కమిషనరేట్‌కి రూ. 574 కోట్లు ప్రకటించారు.

కోట్లు ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలాలను వచ్చే ఏడాది అందించేలా దృష్టి సారించింది.

- పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధికి ప్రగతి పద్దు కింద రూ. 2,786.78 కోట్లు కేటాయించింది.
- విద్యుత్ రంగానికి రూ. 4,393 కోట్లను ప్రతిపాదించింది.
- రైతు కుటుంబాలకు విపత్కర పరిస్థితుల్లో అండగా నిలిచేందుకు రూ. 5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ రైతు బీమా పథకాన్ని ప్రకటించింది. దీనికి రూ. 500 కోట్లను కేటాయించింది.
- వ్యవసాయ యాంత్రీకరణకు రూ. 522 కోట్లు.
- రైతులకు గిట్టుబాటు ధర, కనీస మద్దతు ధర లక్ష్యంగా రైతు సమన్వయ సమితులు పనిచేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.
- రెండు నుంచి నాలుగు దశాబ్దాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ అభివృద్ధికి ప్రణాళికల్ని ప్రభుత్వం ఆవిష్కరించింది.
- వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధారపడినవారికి గొర్రెల పంపిణీ ద్వారా తోడ్పాటునిచ్చిన ప్రభుత్వం చేపల పెంపకం, కోళ్ల పరిశ్రమలకు ప్రత్యేక నిధులనిచ్చింది.
- యాదాద్రి, వేములవాడతో పాటు భద్రాద్రి, బాసర, ధర్మపురి ఆలయాలకు ప్రత్యేక కేటాయింపులు చేసింది.
- ఆర్టీసీకి రూ. 975 కోట్లు ప్రకటించింది.
- వైద్య ఆరోగ్య రంగానికి రూ. 1,400 కోట్ల మేర నిధులను పెంచగా, విద్యారంగానికి నామమాత్రంగానే పెరిగాయి.
- ముఖ్యమంత్రి విచక్షణ మేరకు ఖర్చు చేసే ప్రత్యేక అభివృద్ధి నిధికి రూ. 3,000 కోట్లను కేటాయించింది.
- పట్టణాభివృద్ధి నిధులను పెంచిన ప్రభుత్వం.. తహసీల్దార్ కార్యాలయాలను రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా మారుస్తూ రిజిస్ట్రేషన్ బాధ్యతను తహసీల్దార్‌లకే అప్పగించనున్నట్టు చెప్పింది.
- రాష్ట్ర ఆర్థిక సంఘానికి రూ. 2,500 కోట్లు కేటాయించింది.
- యువజన, పర్యాటక రంగానికి ప్రగతి పద్దు కింద రూ. 86.95 కోట్లు ఇచ్చింది.
- ఆసరా పింఛన్ల ద్వారా 41.78 లక్షల మందికి సాయం అందిస్తున్నామని, బోదకాలు బాధితులకి కూడా నెలకు రూ. 1000 జీవనభృతిని కల్పిస్తామని ప్రకటించింది. ❑

# సానుకూల చిత్రాన్ని ఆవిష్కరించిన ఏపీ సామాజిక ఆర్థిక గణన-2018, అసమానతల్ని తొలగించే చర్యలు చేపట్టాలని సూచన

అసమానతలను తొలగించే దిశగా ప్రజలకు ఆరోగ్యం అందించాలని, సంపదసృష్టిలో భాగస్వామ్యం కలిగించాలని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆంధ్రప్రదేశ్ 'సామాజిక ఆర్థిక గణన-2017-18' సూచించింది. అవరోధాలను అధిగమిస్తూ ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, సేవల రంగాల్లో సానుకూల ఫలితాలను సాధిస్తోందని తెలిపింది. తలసరి ఆదాయంలో మెరుగైన వృద్ధి కనిపిస్తోందని వెల్లడించింది.




ఏపీ ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన నివేదిక.. రంగాలవారీ ప్రాధాన్యంలో భాగంగా వ్యవసాయంలో కరవు నివారణ చర్యలను వివరించింది. సంక్షేమానికి ఏటా రూ.60వేల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ రూ.10వేల ఆదాయం అందించే పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది.

**తలసరి ఆదాయం పెరిగింది**

రాష్ట్రంలో తలసరి ఆదాయం నాలుగేళ్లలో దాదాపు 50శాతం పెరిగింది.

| | |
|---|---|
| 2015-16 | రూ.1,07,276 |
| 2016-17 | రూ.1,23,664 |
| 2017-18 (అంచనా) | రూ.1,42,054 |

**2017-18 జీవీఏ అంచనాలు**

**(రంగాలవారీగా రూ.కోట్లలో)**

| సంవత్సరం | వ్యవసాయం | పారిశ్రామికం | సేవలు |
|---|---|---|---|
| 2015-16 | 1,20,927 | 1,22,588 | 2,02,688 |
| 2016-17 | 1,38,957 | 1,31,657 | 2,21,760 |
| 2017-18 | 1,63,635 | 1,42,837 | 2,41,967 |

- ప్రభుత్వం ఈ ఏడాది 2,358 డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేస్తోంది. 3,500 పాఠశాలల్లో వర్చువల్ తరగతులను ఇంటర్నెట్ సౌకర్యంతో అందుబాటులోకి తెస్తోంది.
- 2016-17 ఖరీఫ్‌లో 39.70 లక్షల హెక్టార్లలో సాగవ్వగా.. 2017-18 ఖరీఫ్‌లో 40.72 లక్షల హెక్టార్లలో పంటలు వేశారు. 2016-17లో 149.16 లక్షల టన్నులు పండించగా, ఈ ఏడాది అంచనా 157.59 లక్షల టన్నులు.
- కర్నూలు జిల్లా తంగెడంచలో 579 ఎకరాల విస్తీర్ణంలో రూ.650 కోట్ల వ్యయంతో మెగాసీడ్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు.
- రాష్ట్రంలో మత్స్యరంగం 14.5 లక్షలమందికి ఉపాధి కల్పిస్తోంది. 2017-18లో దేశం నుంచి రొయ్యల ఎగుమతిలో తొలిస్థానం, ఉత్పత్తిలో 70శాతం వాటా

### జాతీయస్థాయి కన్నా ఎక్కువే

రాష్ట్రం జాతీయ సగటుకన్నా ఎక్కువగా, రెండంకెల వృద్ధి రేటును సాధిస్తోంది. గత మూడేళ్లలో ఏపీ వృద్ధి రేటు సగటున 10.96 శాతం నమోదైంది.

### వాణిజ్యం.. ఎగుమతులు

- పండ్లు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో ఏపీది మొదటిస్థానం. మిర్చి, కోకో, నిమ్మ, ఆయిల్‌పామ్, బొప్పాయి, టమాటా ఉత్పాదకతలోనూ తొలిస్థానం.
- జీడిమామిడి, బత్తాయిలో రెండవస్థానంలో ఏపీ నిలిచింది.
- ఆక్వా, వ్యవసాయ ఉత్పత్తులు ప్రాణాధార మందులు, ఖనిజాలు, ఖనిజ ఉత్పత్తులు, సాఫ్ట్‌వేర్‌లో ఎగుమతులు 2016-17లో (నవంబర్ వరకు) రూ.80,559.87 కోట్లు ఉండగా, 2017-18లో రూ.50,404.75 కోట్లు.


### సర్వేలోని మరిన్ని అంశాలు

- 2017-18లో జీఎస్‌డీపీ పెరుగుదల రేటు 11.22 శాతం. రాష్ట్ర పన్నుల ఆదాయం రూ.52,717 కోట్లు.
- 2018లో నిర్వహించిన మూడో భాగస్వామ్య సదస్సులో 737 ఎంవోయూలు, 4.39 లక్షల కోట్ల పెట్టుబడులు, 11 లక్షల ఉద్యోగాలు.
- 2017-18 డిసెంబర్ నాటికి ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన 43,987
- రాష్ట్రంలో పేదరికం 9.2 శాతం. (దేశంలో 21.92శాతం).
- ఎల్‌పీజీ కనెక్షన్లలో ఏపీదే తొలిస్థానం. 2017-18లో 12.46 లక్షల కనెక్షన్లు ఇచ్చారు.
- గతేడాది 95.36 లక్షలుగా ఉన్న వాహనాలు ఇప్పుడు 103.58 లక్షలకు చేరాయి.
- చౌకదుకాణాల్లో ఈ-పోస్ యంత్రాల అమలుతో రూ.1525.87 కోట్ల మిగులు.
- ఎన్టీఆర్ భరోసా కింద 58 లక్షల మంది పింఛన్లు తీసుకుంటున్నారు. ప్రధానమంత్రి-చంద్రన్న బీమా పథకంలో 2.46 కోట్ల మంది నమోదయ్యారు.

రాష్ట్రానిదే. కోడిగుడ్ల ఉత్పత్తిలో రూ.1,582.74 కోట్లతో రెండోస్థానం. మాంసం ఉత్పత్తిలో 4, పాల ఉత్పత్తిలో 5వ స్థానం ఏపీదే.

- పట్టణ ప్రజలకు ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఎన్టీఆర్ వైద్యపరీక్షలు, చంద్రన్న సంచార చికిత్స, జాతీయ ఉచిత డయాలసిస్, ఆరోగ్య ఏటీఎంలు, ముఖ్యమంత్రి బాలస్వస్థ్య భరోసా, స్వస్థ్య విద్యావాహిని పథకాలను ప్రారంభించారు. ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 14.08 లక్షల మందికి శస్త్రచికిత్సలు చేశారు.
- చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహమిచ్చేందుకు రూ.100 కోట్లతో ప్రత్యేకనిధి ఏర్పాటు. 13 శాఖలకు సంబంధించి 1,946 చిన్న, పెద్ద పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయి.
- రూ.లక్ష వరకు పంట రుణాలకు వడ్డీలేని రుణాల పథకం కింద 2016-17లో రూ.249.48 కోట్లు చెల్లించారు. రూ.3 లక్షల లోపు పంట రుణం తీసుకుని ఏడాదిలోగా చెల్లించినవారికి పావలా వడ్డీ కింద రూ.5.43 కోట్లు జమ చేశారు. 2017-18లో ఇప్పటిదాకా వడ్డీలేని రుణాల కింద రూ.128.41 కోట్లు, పావలా వడ్డీ కింద రూ.3.45 కోట్లు అందచేశారు.
- చంద్రన్న చేయూత ద్వారా 87 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.8,604 కోట్లు పంపిణీ. ❑

# ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2018-19




ఎన్నికలను, ప్రజల మీద తక్షణ ప్రభావం చూపే అంశాలనూ దృష్టిలో పెట్టుకుని రూపొందించిన 2018-19 బడ్జెట్‌ను ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో ప్రవేశపెట్టారు. కేటాయింపుల ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు ఆయా రంగాల్లో నూతన దిశానిర్దేశం ఏమీ లేనప్పటికీ.. ఇదివరకు నామమాత్రపు నిధులతో సరిపెట్టే కొన్ని పథకాలకు, విభాగాలకు ఈసారి కేటాయింపుల్ని పెంచారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాల్ని, యువత, మహిళల్ని ఆకర్షించే ప్రయత్నం చేశారు. స్వయంసహాయక సంఘాలతో సంఘటితమైన మహిళల్ని, విద్యార్థినుల్ని ఆకట్టుకునేలా శానిటరీ నాప్‌కిన్స్ పథకానికి శ్రీకారం చుట్టారు. నిరుద్యోగ భృతి పథకానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. పశువులకు బీమా, పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు, హిజ్రాల సంక్షేమానికి నిధులు ఇచ్చారు. కొన్నేళ్ల తర్వాత లిడ్‌క్యాప్‌కు కేటాయింపులు చేశారు. ఆర్యవైశ్యుల డిమాండ్ అయిన వారి ఉపాధి, సంక్షేమానికి తొలిసారి రూ. 30 కోట్లు ప్రకటించారు. ఆదరణ పథకాన్ని సరికొత్త రీతిలో అమలు చేసేందుకు రూ. 750 కోట్లు కేటాయించారు. సగం ధరకే పేదలకు జనతా వస్త్రాలిచ్చేందుకు రూ. 200 కోట్లు వెచ్చించారు. ఇలా దాదాపు అన్ని సామాజిక వర్గాల చిరకాల డిమాండ్లపై ఎంతో కొంత కేటాయింపులతో వారిని సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారు.

కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికంగా భరోసా లేకున్నా ఏకంగా రూ. 1,91,064 కోట్లతో భారీ బడ్జెట్‌ను ఈ ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించింది. దీనిలో రెవెన్యూ వ్యయం రూ. 1,50,272 కోట్లు కాగా, మూలధన వ్యయాన్ని రూ. 28,678 కోట్లుగా చూపారు. ప్రభుత్వ రుణాల చెల్లింపునకు రూ. 10,851 కోట్లు కేటాయించారు. రాష్ట్ర విభజన తర్వాత 2014-15 నుంచి ఇంతవరకు ప్రతి బడ్జెట్‌లోనూ కేటాయింపులు సగటున రూ. 15వేల కోట్ల వరకు పెరుగుతూ వస్తుండగా, గత సంవత్సరానికీ ఇప్పటికీ కేటాయింపులు ఏకంగా రూ. 34,064.21 కోట్లు పెంచేయడం విశేషం. విభజన తర్వాత రాష్ట్రం ఆర్థిక లోటుతో కొట్టుమిట్టాడుతుందని చెబుతూనే.. 2018-19 బడ్జెట్‌లో రూ. 5,235.24 కోట్లు రెవెన్యూ మిగులుగా చూపించారు. అలాగే ద్రవ్యలోటు అంచనా రూ. 24,205 కోట్లుగా చూపించారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన బకాయిలన్నీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్న ఆశాభావంతోనే రెవెన్యూ మిగులు బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నట్టు ఆర్థికమంత్రి తన ప్రసంగంలో చెప్పుకొచ్చారు. విభజన చట్టం మేరకు కేంద్రం నిధులిచ్చే వాతావరణం లేకపోయినా బడ్జెట్ అంచనాలను భారీగా పెంచుతూ ఆర్థికమంత్రి ఒక విధంగా సాహసం చేశారనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

**కేంద్ర నిధులపై భారీ అంచనాలు**

రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరే ఆదాయ వనరుల్లో కేంద్ర పన్నుల్లో వాటా రూపంలో రూ. 33,930 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ. 50,696 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్నుల ద్వారా రూ. 65,535 కోట్లు వస్తాయని అంచనా వేశారు. 2017-18 సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలకు, 2018-19 బడ్జెట్ అంచనాలకు మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. 2017-18 సవరించిన అంచనాల ప్రకారం కేంద్ర పన్నుల్లో వచ్చే వాటా రూ. 29,001 కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రూపంలో వచ్చేది రూ. 37,548 కోట్లు మాత్రమే ఉంది. రాష్ట్ర సొంత పన్నుల ద్వారా సమకూరిన ఆదాయం కూడా రూ. 52,715 కోట్లుంది. అటు కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు వస్తాయని, ఇటు రాష్ట్ర సొంత వనరులు భారీగా పెరుగుతాయని భరోసా లేకపోయినా.. బడ్జెట్ పరిమాణాన్ని మాత్రం పెంచేశారు. రాష్ట్ర వనరుల్లో కీలకమైన జీఎస్‌టీ ద్వారా రూ. 38,448 కోట్లు వస్తాయని అంచనా వేశారు. కిందటేడాది ఈ విభాగంలో రూ. 32,893 కోట్లుగా

| బడ్జెట్ స్వరూపం (రూ. కోట్లలో) | |
|---|---|
| మొత్తం బడ్జెట్ | 1,91,064 |
| రెవెన్యూ వ్యయం | 1,50,272 |
| మూలధన వ్యయం | 28,678 |
| రుణ చెల్లింపులు | 10,851 |
| మొత్తం రెవెన్యూ వసూళ్లు | 1,55,507 |
| **కేంద్రం నుంచి వచ్చేవి** | |
| కేంద్ర పన్నుల్లో వాటా | 33,930 |
| గ్రాంట్లు | 50,696 |
| రాష్ట్ర పన్నుల ద్వారా ఆదాయం | 65,535 |
| అమ్మకపు పన్ను | 38,448 |
| ఎక్సయిజ్ | 7,357 |
| మోటార్, వాహన పన్ను | 3,687 |
| స్టాంపులు, రిజిస్ట్రేషన్ | 4,880 |
| రాష్ట్ర పన్నేతర ఆదాయం | 5,346 |
| గనులు, ఖనిజాలు | 2,500 |
| అటవీ | 600 |
| రెవెన్యూ మిగులు అంచనా | 5,235 |
| ద్రవ్యలోటు అంచనా | -24,205 |
| రాష్ట్ర స్థూల ఉత్పత్తి | 8,70,330 |

| రెవెన్యూ వ్యయం | |
|---|---|
| జీతాలు | 39,121 |
| పింఛన్లు | 15,427 |
| వడ్డీ చెల్లింపులు | 15,076 |
| నిర్వహణ | 1,604 |
| వేతనేతర | 7,387 |
| **రాయితీలు, గ్రాంట్లు** | |
| రైతులకు రుణ రాయితీలు | 4,100 |
| విద్యుత్తు రాయితీ | 2,500 |
| ధాన్యం రాయితీ | 3,140 |
| **సంక్షేమ పథకాలు** | |
| ఎస్సీ కాంపొనెంట్ | 11,228 |
| ఎస్టీ కాంపొనెంట్ | 4,177 |
| బీసీ కాంపొనెంట్ | 12,200 |
| కాపు సంక్షేమం | 1000 |
| ఈబీసీ సంక్షేమం | 700 |
| బ్రాహ్మణ సంక్షేమం | 75 |
| మైనారిటీల సంక్షేమం | 1,102 |
| ఆర్యవైశ్యుల సంక్షేమం | 30 |

సవరించిన అంచనాల్లో పేర్కొనటం గమనార్హం. ఎక్సయిజ్‌లోనూ ఏకంగా రూ.రెండు వేల కోట్లు పెరుగుదలను ఆశించారు. పన్నుల వసూలులో లోటుపాట్ల సవరణ, ఆదాయవనరుల్ని పెంచుకోవడం, కేంద్ర పథకాల ద్వారా వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టడం ద్వారా అంచనాలను అందుకోగలమని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

**ప్రాధాన్య రంగాలకు పెంపు**

2017-18 సవరించిన బడ్జెట్ అంచనాలతో పోలిస్తే 2018-19లో కేటాయింపులు 21.70 శాతం ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యతారంగాలైన వ్యవసాయం, నీటిపారుదల వంటి వాటికి పెంచారు. ఆర్థిక సేవల రంగాలకు 19.89 శాతం, సామాజిక సేవారంగాలకు 30.92 శాతం, సాధారణ సేవలకు 14.16 శాతం చొప్పున అదనంగా పెంచారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు 35.91 శాతం, నీటిపారుదల, వరద నియంత్రణకు 32.95 శాతం, క్రీడలు, యువజన సర్వీసులకు 62.70 శాతం, గృహనిర్మాణానికి 152 శాతం చొప్పున పెంచారు. పోలవరం ప్రాజెక్టుకి ఈ బడ్జెట్‌లో రూ. 9వేల కోట్లు కేటాయించారు. కేంద్రం సకాలంలో నిధులివ్వకున్నా ఇబ్బంది లేకుండా చూసేందుకే ఈ ఏర్పాటు చేశారు. కూలీల కొరతతో యాంత్రీకరణకు మొగ్గు పెరుగుతున్న నేపథ్యంలో కిందటేడాది కన్నా రూ. 103 కోట్లు పెంచి, 250 కోట్లు కేటాయించారు.

**వివిధ వర్గాలవారీగా స్కీములకముఖ్యాంశాలు..**

- ఎస్సీ, బీసీ కులాలకు చెందిన వధువుల వివాహ ఆర్థిక సాయానికి చంద్రన్న పెళ్లికానుక పథకం కింద చెరో రూ.వంద కోట్లు.
- బీసీల్లోని చేతివృత్తుల వారికి ఆదరణ పథకాన్ని మళ్లీ ప్రవేశపెడుతూ రూ. 750 కోట్లు కేటాయింపు. దీనివల్ల

2.55 లక్షలమందికి లబ్ధి చేకూరుతుందని అంచనా.

- మత్స్యకారుల జీవనోపాధి మెరుగుదల, రాయితీ ధరలపై వారికి మరపడవలు, వలలు, డీజిల్ అందించే ప్రతిపాదన. 50 సంవత్సరాలు పైబడిన మత్స్యకారులకు సామాజిక భద్రత పింఛను.
- గిరిజన ప్రాంతాల్లో అన్ని పంచాయతీలకు అత్యాధునిక ట్రిపుల్ ప్లే సర్వీసులు. వయబిలిటీ గ్యాప్ నిధి కింద రూ.90 కోట్లు.
- గిరిజనులకు పోషకాహారాన్ని సమకూర్చేందుకు ఫుడ్ బాస్కెట్‌లు, ఐటీడీఏల్లో మార్కెటింగ్, సరకు నిల్వ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి రూ.50 కోట్లు.
- తల్లులు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని సరిదిద్దేందుకు ప్రత్యేక పోషకాహార పథకానికి రూ.383 కోట్లు. ఐఎంఆర్, ఎంఎంఆర్ సూచికలను తగ్గించేందుకు అన్న అమృతహస్తం పథకాన్ని 257 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో అమలు.
- కౌమార బాలికల్లో జీవనవిధాన నైపుణ్యాలు, పోషకాహారం, విద్య, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపైన అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన సబల పథకాన్ని శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాలకు విస్తరణ.
- ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియెట్ కళాశాలల్లోని కౌమార బాలికలకు, స్వయంశక్తి సంఘాల మహిళలకు, ఇతర కౌమార బాలికలకు శానిటరీ నాప్‌కిన్లు అందించటానికి రూ.127 కోట్లు.
- హిజ్రాలు గౌరవప్రదంగా జీవించేందుకు వీలుగా ప్రత్యేక విధానానికి రూ.20 కోట్లు కేటాయింపు.

**బడ్జెట్ స్వరూపం (రూ. కోట్లలో)**

| సంవత్సరం | అంచనా | వాస్తవ ఖర్చు |
|---|---|---|
| 2014-15 | 1,11,824.00 | 1,38,449.60 |
| 2015-16 | 1,13,048.98 | 1,49,434.96 |
| 2016-17 | 1,35,688.99 | 1,66,698.69 |
| 2017-18 | 1,56,999.39 | 1,59,822.25 |
| 2018-19 | 1,91,063.60 | ............... |

### రూ.19,070 కోట్లతో వ్యవసాయ బడ్జెట్

'రైతే ముందు' నినాదంతో రూ.19,070.36 కోట్లతో 2018-19 వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్‌ను ఏపీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రవేశపెట్టారు. దీనిలో రెవెన్యూ వ్యయం రూ.18,602.98 కోట్లుకాగా, పెట్టుబడి వ్యయం రూ.467.38 కోట్లు.

- లక్ష వరకూ పంట రుణం తీసుకున్న రైతులు సకాలంలో దాన్ని తిరిగి చెల్లించనట్టయితే వడ్డీ లేకుండా రుణ సదుపాయం వర్తిస్తుంది. దీనికోసం రూ.172 కోట్లు.
- రాష్ట్రంలో మెగాసీడ్‌పార్క్ కంపెనీ లిమిటెడ్ నిర్వహణకు రూ.100 కోట్లు.
- రైతు రుణవిముక్తి నాలుగో విడత కింద రూ.4,100 కోట్లు.
- ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ అనుబంధ రంగాల్లో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.3,980 కోట్లు ఖర్చు చేయాలని కార్యాచరణ ప్రణాళిక.
- 14 వ్యవసాయ మార్కెట్లు, 89 రైతుబజార్ల ఆధునికీకరణ.
- శాఖలవారీగా.. ఉద్యానశాఖకు రూ.1,517 కోట్లు, పశుసంవర్ధకానికి 1,223.40 కోట్లు, మత్స్యశాఖకు 386, మార్కెటింగ్‌కు 208.11 కోట్లు కేటాయించారు. గ్రామీణ ఉపాధి హామీ అనుసంధానం కింద రూ.4,730 కోట్లు వెచ్చిస్తారు.

- విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీకి ఉద్దేశించిన బడికొస్తా కార్యక్రమానికి రూ.160 కోట్లు.
- కొత్త డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు. రూ.100 కోట్లతో పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఇకపై వారానికి 5 కోడిగుడ్లు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కూడా పోషకాహార భోజనం. యువతలో ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల ప్రయోగశాలల ఏర్పాటు. కొత్త విశ్వవిద్యాలయాలన్నిటిలో మౌలిక సదుపాయాలు.

**తలసరి రూ.47,511 అప్పు**

ఈ ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ రుణం రూ.2,49,435 కోట్లకు చేరుకుంటుందని ఆర్థికశాఖ అంచనా. రాష్ట్ర జీడీపీలో ఈ అప్పులు 28.66శాతంగా ఉంటాయి. తలసరి అప్పు రూ.47,511గా ఉంటుంది. ఏపీ, తెలంగాణ మధ్య పంచాల్సిన అప్పు రూ.23,483 కోట్లుగా ఉందని తెలిపారు. రాష్ట్ర అప్పుల్లో బహిరంగ మార్కెట్ రుణాలు రూ.1,57,779.19 కోట్లు, కేంద్రం నుంచి తీసుకున్న రుణాలు రూ.9,218.10 కోట్లు, ఇతర సంస్థల నుంచి రూ.15,028.63 కోట్లు, చిన్న మొత్తాల పొదుపు రూపంలో రూ.12,367.24 కోట్లు, ప్రావిడెంట్ ఫండ్ రూపంలో రూ.15,272.06 కోట్లు, రిజర్వు నిధులు, డిపాజిట్లు రూ.39,770.15 కోట్లు ఉన్నాయి.

- సాంఘిక, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉపాధి కల్పించే నైపుణ్యాలను సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణనిచ్చి, వారు ఉద్యోగాలు పొందేలా చేయడం కోసం 1000 నైపుణ్య శిక్షణా కేంద్రాలు.
- 10 లక్షల జంతువులకు బీమా. రూ.50 కోట్లు కేటాయింపు.
- ఐటీ రంగానికి ఊతమిచ్చేందుకు అంకుర వ్యాపార సంస్థల ప్రోత్సాహకాలకు రూ.100 కోట్లు.
- పల్లెవెలుగు బస్సుల కొనుగోలు కోసం రూ.200 కోట్లు గ్రాంట్.
- అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అన్న క్యాంటీన్లకు రూ.200 కోట్లు.
- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో రూ.75 కోట్లతో ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన. పురపాలక పాఠశాలల బలోపేతం. ఇటీవలికాలంలో ఇటువంటి గ్రాంట్‌లనివ్వటం లేదు.
- కళలు, సంగీతం, చరిత్ర, విజ్ఞాన శాస్త్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 7 అకాడమీలు ఈ సంవత్సరం నుంచే కార్యకలాపాల్ని ప్రారంభిస్తాయని తెలిపారు. ❑

# ఏపీకిచ్చిన విభజన హామీలపై 'స్వతంత్ర నిపుణుల బృందం'ను ఏర్పాటు చేసిన ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా

"రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు చట్టపరంగానూ, పార్లమెంటులోనూ ఇచ్చిన హామీల్ని భారత ప్రభుత్వం ఏ మేరకు నెరవేర్చిందీ తేల్చటం,

కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిలా పనిచేస్తూ వివాద పరిష్కారానికి తోడ్పాటునందించే పౌరసమాజంగా వ్యవహరించటం,

ఇతరత్రా అంశాలు దీనికి సంబంధించి ఏమైనా ఉన్నా కూడా అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేయటం"

.. లక్ష్యాలుగా ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) తరపున ఒక 'స్వతంత్ర నిపుణుల బృందాన్ని' (ఐజీఈ) ఏర్పాటు చేసినట్టు ఎఫ్‌డీఆర్ ప్రధాన కార్యదర్శి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

ఐజీఈలో.. సి. ఆంజనేయ రెడ్డి (రిటైర్డ్ ఐపీఎస్), పి. చెంగల్‌రెడ్డి (రైతు సంఘాల సమాఖ్య సెక్రటరీ జనరల్), హెచ్‌జే దొర (మాజీ ఐపీఎస్, మాజీ సీవీసీ), ప్రొఫెసర్ ఎస్. గలాబ్ (సెస్ డైరెక్టర్), ప్రొఫెసర్ ఎం. గోవిందరావు (14వ ఆర్థికసంఘం సభ్యులు), జస్టిస్ ఎంఎన్ రావు (హిమాచల్‌ప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి, జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్), కె. మాధవరావు (ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్), కె. పద్మనాభయ్య (రిటైర్డ్ ఐఏఎస్, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి), జస్టిస్ పర్వతరావు (ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి), ప్రొఫెసర్ రాధాకృష్ణ (సెస్ ఛైర్మన్), రాఘవాచారి (విశాలాంధ్ర మాజీ సంపాదకులు), ప్రొఫెసర్ శాంతా సిన్హా (బాలల హక్కుల పరిరక్షణ జాతీయ సంఘం మాజీ ఛైర్‌పర్సన్), కె. సుజాతారావు (కేంద్ర ప్రభుత్వ మాజీ ఆరోగ్య కార్యదర్శి), కె.ఆర్ వేణుగోపాల్ (రిటైర్డ్ ఐఏఎస్, ప్రధానమంత్రి మాజీ కార్యదర్శి), డా॥ జేపీ సభ్యులుగా ఉన్నారు.

అవసరాన్ని బట్టి, వారు అందుబాటులో ఉండటాన్ని బట్టి తదుపరి సమావేశాలలో ఇతర నిపుణుల్ని కూడా ఐజీఈలో భాగస్వాములయ్యేందుకు ఆహ్వానిస్తామని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. స్వతంత్ర నిపుణుల బృందం తొలి సమావేశం మార్చి 30న హైదరాబాద్‌లో జరిగింది. (వివరాలు వచ్చే సంచికలో)

# హోదాపై పోరు పెద్దమార్పులకు దారితీయాలి





ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక తరగతి హోదా ఇస్తామని చెప్పి ప్రధానమంత్రి నమ్మించి మోసం చేశారని, ఇది తెలుగు ప్రజలనే కాకుండా దేశ ఫెడరల్ వ్యవస్థనే చిన్నచూపు చూడటమని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. రాష్ట్రంలో అధికార తెలుగుదేశం, ప్రతిపక్ష వైకాపా కూడా అసమర్థంగా, గోడ మీద పిల్లివాటంగా వ్యవహరించాయన్నారు. చట్టసభల్ని, రాజ్యాంగ పద్ధతుల్ని ఉపయోగించుకుని ఉంటే ఈపాటికి హోదా, విభజన హామీలు అమలై ఉండేవన్నారు. పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చినట్టు మోదీ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. కేంద్ర మోసాలు తెదేపా, వైకాపాకు ఎన్నికలప్పుడు గుర్తుకురావటం రాష్ట్ర ప్రజల్ని దారుణంగా వంచించటమేనని విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. మోదీ మంత్రివర్గం నుంచి రాజీనామా చేసిన అశోక్‌గజపతిరాజు పౌరవిమానయాన రంగంలో తనదైన ముద్ర వేశారని, 80 విమానాశ్రయాలను పునరుద్ధరించారని, ప్రపంచ మార్కెట్‌లో మన విమాన రవాణాను మూడవ స్థానంలో నిలిపారని అన్నారు. జిల్లాలో అవినీతి మీద, జిందాల్, జమ్మాదేవిపేట రైతులకు న్యాయం చేయటానికి కూడా అశోక్ చర్యలు తీసుకోవాలని కోరారు. హోదాకు వ్యతిరేకంగా పార్టీపరంగా, పార్టీలకతీతంగా లోక్‌సత్తా చేస్తున్న పోరాటాలకు మంచి మద్దతు వస్తోందన్నారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో విశాఖ బీచ్‌లో చేసిన అఖిలపక్ష కాగడాల ప్రదర్శనకు ప్రజలు భారీగా స్పందించారన్నారు. దీనిపై లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ ప్రత్యేకించి అభినందించారన్నారు. రాష్ట్ర విభజన నుంచి జరిగిన పరిణామాలు తెలుగువారికి, దేశప్రజలకు పెద్ద పాఠాలని, వాటి నుంచి మన రాజకీయాల్ని, పాలనను బాగుచేసుకుందామని బాబ్జీ అన్నారు.


విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌ని ప్రకటించకపోతే బీజేపీకి ఉత్తరాంధ్ర ప్రజల సత్తా చూపించాల్సిందేనని లోక్‌సత్తా పార్టీ నేత అల్లంశెట్టి నాగభూషణరావు గాంధీ విగ్రహం వద్ద చేసిన నిరసన కార్యక్రమంలో అన్నారు. పార్టీ విజయనగరం పట్టణ కార్యదర్శి తాతారాజు రాజారావు మాట్లాడుతూ, రాష్ట్ర విభజన సమయంలో 13వ షెడ్యూల్‌లో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలన్నారు. శిమ్మ శ్రీను, ఆదీశ్వరరావు, ఎర్నిబాబు, భాస్కర్, ప్రకాష్, లత, దేవి, రమణమ్మ, సూరిబాబు తదితర లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

### హోదా కోసం ఏకతాటి మీదకు రావాలి

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక తరగతి హోదా కోసం పోరాటంలో అన్ని పార్టీలూ ఏకతాటి మీదకు రావాలని బాబ్జీ విజ్ఞప్తి చేశారు. ఫెడరలిజం, సహాయ నిరాకరణ వంటి రాజ్యాంగబద్ధ పద్ధతుల్లో కేంద్రంపై పోరాటానికి లోక్‌సత్తా సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనపై విజయవాడలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో, ఆ తర్వాతా జరిగిన అఖిలపక్ష కార్యక్రమాల్లో లోక్‌సత్తా నేతలతో కలిసి బాబ్జీ పాల్గన్నారు. హోదా, విభజన సాధనా సమితి వ్యవస్థాపకుడు చలసాని శ్రీనివాస్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం కార్యదర్శి మధు, జనసేన నాయకుడు శ్రీధర్, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, నటుడు శివాజీ, నాగేశ్వరరావు, ప్రజాసంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ❑

## మద్యాన్ని ఆదాయమార్గం చేసుకోవటం దుర్మార్గం

సామాన్య, నిరుపేద ప్రజలు లక్షలాదిగా చితికిపోతున్నా, మహిళల బతుకుల్ని కాలరాస్తున్నా ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయమార్గంగా చేసుకుని దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని లోక్‌సత్తా పార్టీ రాయదుర్గం అధ్యక్షుడు వెంకటరమణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని కేబీ ప్యాలెస్ రోడ్డులోని శ్రీగుప్తా కాంప్లెక్స్‌లో నూతనంగా బార్ ఏర్పాటు చేయటానికి వ్యతిరేకంగా కాలనీవాసులతో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కి ఆయన అర్జీని అందచేశారు. బార్‌ను ఏర్పాటు చేసే ప్రజాఉద్యమం తప్పదని హెచ్చరించారు.



## నిజమైన పౌరసత్వానికి నిదర్శనం రాయ్



ఎంవీఎస్ రాయ్ మృతి తనను తీవ్ర విచారానికి గురిచేసిందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రాయ్‌తో కలిసి 34 ఏళ్లపాటు పనిచేసే అవకాశం తనకు లభించిందన్నారు. "ప్రజాప్రయోజనాల్ని పెంపొందించేందుకు అలుపు లేకుండా క్రమశిక్షణతో పనిచేసిన నాయకుడు, గొప్ప స్నేహితుడు, అంకితభావం గల తండ్రి, కుటుంబ సభ్యుడు, అద్భుతమైన మానవుడు రాయ్. నిజమైన పౌరసత్వానికి నిదర్శనమాయన. రాయ్ సామాజిక రాజకీయంలో భాగమై తమ మనసుల్లోని శూన్యాన్ని భర్తీ చేసుకున్న వారెందరో ఉన్నారు. వారందరికీ ఆయన మృతి పెద్ద వెలితి. మాటలు పూడ్చగలిగే వెలితి కాదది" అన్నారు. రాయ్ కుటుంబసభ్యులు, ఆయన అసంఖ్యాక మిత్రులు, అభిమానులకు జేపీ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియచేశారు.

## వ్యవసాయాన్ని బాగుచేయటమే వలసల్ని ఆపటానికి మార్గం

వ్యవసాయాన్ని వృత్తిగా కాకుండా ప్రవృత్తిగా ప్రచారం చేస్తూ పాలకులు, పలువురు నేతలు మోసం చేస్తున్నారని, సాగును వ్యాపారంలా చేస్తేనే రైతులు మనుగడ సాగించగలరని బాబ్జీ అన్నారు. సంవత్సరాది సందర్భంగా విజయనగరంలో తనను కలిసిన రైతులతో మాట్లాడుతూ, రైతులకు, ఇతర గ్రామీణ వృత్తులవారికి తగిన ఆదాయం వచ్చేలా వ్యవసాయాన్ని ప్రక్షాళన చేస్తేనే, గ్రామాలను ఆధునీకరిస్తేనే వలసను ఆపగలమన్నారు.



## టిఫిన్ బాక్సు ఛాలెంజ్‌తో అందరూ మారాలి

టిఫిన్ బాక్సు సవాల్‌తో అందరూ మారాలని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము పిలుపునిచ్చారు. "మారాలి.. అందరం మారాలి.. నగర పర్యావరణాన్ని కాపాడుకునేందుకు శ్రీ విళంబి ఉగాది పర్వదినం నుంచే అంతా టిఫిన్ బాక్సులు, జూట్ సంచులు వాడాలి" అని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో టిఫిన్ డబ్బాలు, జూట్ సంచులను వాడాలని జీహెచ్‌ఎంసీ యంత్రాంగం ఎప్పటినుంచో సూచిస్తున్నా పెద్దగా ఎవరూ పట్టించుకోవటం లేదన్నారు. ఏ దుకాణం వద్ద చూసినా ఒకరిద్దరు మినహా మిగతావారంతా ప్లాస్టిక్ సంచులనే వాడుతున్నారని వాపోయారు. పర్యావరణ పరిరక్షణ సంకల్పంతో టిఫిన్ డబ్బా, జూట్ సంచి వాడాలని ప్రతిజ్ఞ చేస్తూ 10మంది కార్పొరేటర్లకు సవాలు విసురుతున్నట్టు చెప్పారు. వారు కూడా ఈ సవాలును స్వీకరించి మరో పదిమంది చొప్పున స్వీకరించేలా చేయాలన్నారు. ఈ ఏడాది నగరంలో సుమారు 25 లక్షల కుటుంబాలు ఈ మహాయజ్ఞంలో భాగస్వాములవ్వాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. దీనికి సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న ప్రచారానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. ❑



# రాజకీయ క్రీడల్లో ప్రజలు పావులు కాకూడదు



ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీల అమలు చుట్టూ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రాజకీయ క్రీడల్లో ప్రజలు సమిధలు, పావులు కాకుండా చూడాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రత్యేక హోదాపై పార్లమెంటు సాక్షిగా ప్రధానమంత్రి ఇచ్చిన హామీయే అమలుకు నోచుకోకపోతే ఇక దిక్కేవరన్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు ధోరణి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో నాలుగేళ్లపాటు హోదాను నిర్లక్ష్యం చేయటంతో ఇప్పుడు పరిస్థితి జటిలంగా మారిందని, ప్రజలకు జీవన్మరణ సమస్యగా తయారైందని అన్నారు. కర్నూలులో మీడియాతో జేపీ మాట్లాడారు. ప్రత్యేక హోదాను రాజకీయ కోణంలో చూడకుండా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. కేవలం ఎన్నికల కోణంలో చూస్తే రాష్ట్రం ఇంకా ఇంకా మోసపోవాల్సి వస్తుందని, రాబోయేకాలంలో రాజకీయ పార్టీలు కూడా మునుగుతాయని అన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలోని ప్రాంతాలకు హోదా పన్ను రాయితీల్ని సాధించేందుకు, పారిశ్రామికంగా ఎదిగేందుకు అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. ప్రతి పనికీ రాజధానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా సీమ, ఉత్తరాంధ్రల్లో ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధిని, పాలనను వికేంద్రీకరించటం చాలా ముఖ్యమన్నారు. ప్రత్యేక హోదా, ప్యాకేజీ, ఇతర అంశాల్లో ఏపీని వంచించటమంటే కేంద్రప్రభుత్వం దేశంలో ఓ భాగాన్ని వంచించటమేనని, కేంద్రం తీరు అలా ఉంటే రాష్ట్రస్థాయిలో పాలకులు బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్‌లకు రెడ్‌కార్పెట్‌లు పరవటం తప్ప చిన్న పరిశ్రమలకు అవకాశం కల్పించటం లేదన్నారు. యువతకు ఎక్కువ ఉపాధినిచ్చేవి చిన్న పరిశ్రమలేనన్నారు. నాలుగేళ్లలో ఏపీలో ఎక్కడా చెప్పుకోదగిన అభివృద్ధి, ఉపాధి సృష్టి లేవన్నారు. విద్య, వైద్య ఆరోగ్యం, చిన్న పరిశ్రమలు, వ్యవసాయం వంటి వాటిని ప్రాధాన్యాంశాలుగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం గట్టి కృషి చేయాలన్నారు. ప్రజల జీవితాల్ని నిజంగా బాగుచేసే ఈ అంశాలపై ఆలోచించే స్థితిలో రాజకీయ పార్టీలు లేకపోవటం విషాదకరమన్నారు. ఎక్కడ చూసినా రాష్ట్రంలో ఎన్నికల రాజకీయాలే మాట్లాడుతున్నారు తప్ప ఎన్నికల లక్ష్యమైన సురాజ్య ఎజెండా గురించిన ప్రస్తావనే లేదన్నారు. ఓ పార్టీ నిరుద్యోగ భృతినిస్తానంటే, మరో పార్టీ 40 ఏళ్లకే పెన్షన్ ఇస్తానంటూ దివాళాకోరు ప్రకటనలు చేస్తూ రాజకీయ చదరంగం ఆడుతున్నాయన్నారు. ఇలాంటి హామీల్ని నమ్మితే మరోసారి ఏపీ ప్రజలు మోసపోతారన్నారు. దేశంలో అత్యధిక సంఖ్యాక ప్రజలు ఆధారపడిన వ్యవసాయం, పాలకుల విధానాల వల్ల తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. దిగుమతులను పెంచుతూ ఎగుమతులను తగ్గించటం వల్ల పత్తి, వేరుసెనగ తదితర పంటలకరైతులు ఎడాపెడా నష్టపోతున్నారన్నారు. ఒక్క ఏడాదిలోనే లక్షా 30వేల కోట్ల విలువైన వ్యవసాయోత్పత్తులను అదనంగా దిగుమతి చేసుకుని మన రైతుల ఆదాయానికి పాలకులు గండికొట్టారన్నారు. ఒకప్పుడు ఎన్టీరామారావు, కరుణానిధి, జోతిబసు, రామకృష్ణ హెగ్డే వంటి వారు కేంద్ర విధానాలపై పోరాడి రాష్ట్రాలకు నిధుల్ని తెచ్చుకుంటే.. ప్రస్తుత ముఖ్యమంత్రులు కేంద్రం ముందు మోకరిల్లుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు ఫెడరలిజానికి వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీల్ని, విభజన చట్టంలో చెప్పినవి కచ్చితంగా ఏపీ, తెలంగాణలకు నెరవేర్చి తీరాలని జేపీ స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి పోటీచేస్తారా అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, లాభసాటి వ్యవసాయం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం వంటి అంశాల ప్రాతిపదికన వస్తే ఎవరితోనైనా కలిసి పనిచేస్తామని జేపీ తెలిపారు. లోక్‌సత్తా ఉద్యమసంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బందారు రామ్మోహనరావు, లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు నంది ఎల్లయ్య, డాక్టర్ పద్మన్న, నాయకులు జగన్నాథరెడ్డి, రాజ్యలక్ష్మి, దేవిడ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సత్యనారాయణ జేపీని మర్యాదాపూర్వకంగా కలిసి మాట్లాడారు.

### హైకోర్టు ఏర్పాటు చేయాలి

శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని రామ్మోహనరావు, బాబ్జీ డిమాండ్ చేశారు. కర్నూలు శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద న్యాయవాదులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించి వారు సంఘీభావం తెలిపారు.

### బుడగ జంగాల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

కుల ధృవీకరణ పత్రాలు అందక తమ పిల్లలు విద్యకు దూరమవుతున్నారని, తమను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని బుడగ జంగం నాయకులు జేపీకి వినతిపత్రం ఇచ్చారు. సంచార దళిత బేడ, బుడగ జంగాల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎదుగుదల కోసం సరైన విద్య మీద దృష్టి పెట్టాలని వారికి జేపీ సూచించారు. ❑



# అంబేద్కర్‌కి నిజనివాళి ఈ ఆలోచనల ఆచరణే: జేపీ

- పుట్టుకతో వివక్షను తొలగించేందుకు ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను  అందించే వ్యవస్థను నిర్మించటం
- బంద్‌లు, రాస్తారోకోలు, ఆమరణ నిరాహారదీక్షలు వంటి వలస పాలననాటి పద్ధతుల ద్వారా కాకుండా... స్వతంత్ర  భారత రాజ్యాంగం ఆయుధంగా పాలకుల విధానాలపై పోరాడటం
- కులం గుర్తులైన చౌదరి, రెడ్డి, నాయుడు, వర్మ, యాదవ్, గౌడ్ లాంటి పదాల్ని పేర్లలో నుంచి తొలగించడం
- కులాంతర, మతాంతర వివాహాలను మన ఇళ్లల్లో ఆచరించి చూపటం
- కులం, మతం, ప్రాంతం, భాషతో సంబంధం లేకుండా సామర్థ్యాన్ని, విలువల్ని బట్టే మనిషిని అంచనా వేసే జాతి నిర్మాణం చేయటం.

(ఏప్రిల్ 14 బాబాసాహెబ్ జన్మదినోత్సవం)

Posting Date 07-04-2018
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on April 1st, 2018












# సృజనాత్మక విద్యనందించాలి : జేపీ

సమస్యల్ని చూసి పారిపోకుండా, సవాళ్లను పట్టుకుని కొత్త పద్ధతులతో పరిష్కరించగలిగే, సమాజానికి ఉపయోగపడుతూ ఉపాధిని పొందగలిగే సృజనాత్మక విద్యను విద్యార్థులకు అందించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా. జేపీ అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.70,000 దాకా ఖర్చు చేస్తున్నా... సరైన విద్య అందటం లేదన్నారు. విలువైన సంపద మేధస్సు ద్వారానే లభిస్తుందన్నారు. సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన యంగ్ జీనియస్ పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి టైమ్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ కిరణ్‌తో కలిసి బంగారు పతకాలను జేపీ అందజేశారు.




**Book-Post**
PRINTED MATTER

To

If not delivered please return to:

**Lok Satta Times**
Tulips Apartment,
6-3-655, Flat.No. 407,
Behind Civil Supplies Office,
Somajiguda
Hyderabad- 500082

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad